RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 12 గురువారం 6 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## బెంగళూరుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి..

బెంగళూరు: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి విషయంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బెంగళూరులో గురువారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్యతోపాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల ధన సహాయ కమిషన్ వెలువరించిన నియమావళి గురించి నగరంలోని ఐటీసీ విండ్సర్ మానర్ హోటల్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు.

# ఢిల్లీ పీఠం ఆ పార్టీదే..

## ఎగ్జిట్‌పోల్స్ అంచనాలివే.. కేకే సర్వే రిపోర్ట్ ఏంటంటే..




ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.. సీలంపూర్, జంగ్‌పూర్, అకోలా నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. కాగా.. సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్ ఉంది. గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. ఢిల్లీలో అంచనాలను మించి పోలింగ్ శాతం నమోదవడంతో.. అంచనాల్లో పార్టీలు తలమునకలవుతున్నాయి. 2020 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 44.52 శాతం పోలింగ్ నమోదైంది.. 2025లో సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్... గత ఎన్నికలతో పోలిస్తే 13 శాతం పోలింగ్ పెరిగింది.. పెరిగింది అనుకూల ఓటా..? ప్రతికూల ఓటా..? అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంచనావేస్తున్నాయి..

ఈ క్రమంలోనే పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్‌పోల్స్ విడుదలయ్యాయి.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై జాతీయ ఛానెల్స్ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి.. 2020 ఎన్నికలతో పోలిస్తే 13శాతం ఓటింగ్ పెరగడంతో.. ఇది గెలుపోటములపై ప్రభావం చూపనుందని పేర్కొంటున్నాయి.. ఈ సారి బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ ఉందని కొన్ని ఛానెళ్లు అంచనా వేశాయి.. మరికొన్ని.. బీజేపీకి అనుకూలంగా.. ఇంకొన్ని ఆప్ గెలిచే అవకాశం ఉందని పేర్కొన్నాయి..

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఇవే..** మ్యాట్రిజ్ %-% ఆప్ 32-37, బీజేపీ 35-40, కాంగ్రెస్ 0-1 స్థానాలు. పీపుల్స్ ఇన్‌సైట్- ఆప్ 25-29, బీజేపీ 40-44, కాంగ్రెస్0-1 స్థానాలు. రిపబ్లిక్ పీమార్క్- ఆప్ 21-31, బీజేపీ 39-49, కాంగ్రెస్ 0-1 స్థానాలు. కేకే సర్వే: ఆప్ 39, బీజేపీ 22, కాంగ్రెస్ 9స్థానాలు. టైమ్స్‌నౌ: ఆప్ 22-31, బీజేపీ 39-45, కాంగ్రెస్ 0-2. పీపుల్స్ పల్స్: ఆప్ 10-19, బీజేపీ 51-60. చాణక్య స్ట్రాటజీస్: బీజేపీ 39-44 స్థానాలు, ఆప్ 25-28, కాంగ్రెస్ 2-3. జేవీసీ ఎగ్జిట్‌పోల్: బీజేపీ 39-45 స్థానాలు, ఆప్ 22-31, కాంగ్రెస్ 0-2. అయితే.. ఢిల్లీ ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం.. బీజేపీకే స్పష్టమైన ఆధిక్యం కన్పిస్తోంది. 25 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ గెలుస్తుందని మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి. ఓట్ల శాతం పెరగడంతో బీజేపీకి అనుకూలంగా ఉంటుందన్న భావన కన్పిస్తోంది. ఢిల్లీ మొత్తం 70 స్థానాలు కాగా మెజారిటీ దక్కాలంటే 36 స్థానాలు దక్కాలి. పోల్ ఆఫ్ పోల్స్‌లో కూడా బీజేపీకే ఆధిక్యం లభించింది.

# కులగణనపై ఎంపీ రాహుల్ గాంధీకి కేటీఆర్ సూటి ప్రశ్న..




హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి వారిని దారుణంగా వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పులతడకగా లెక్కలు వేసి సర్వే పూర్తయిందని చెప్పడం ముమ్మాటికీ వెనకబడిన వర్గాలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే పూర్తి చేసిందని లోక్ సభలో మీరు (రాహుల్ గాంధీ) చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. లక్షలాది మంది వివరాలు సేకరించకుండా సర్వే ఎలా పూర్తవుతుందని రాహుల్‌ని కేటీఆర్ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ సర్వే ఇలా..** పదేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లుగా తేలిందని, రాష్ట్ర జనాభాలో ఇది 51 శాతంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. మైనారిటీల్లో ఉన్న బీసీలనూ కలిపితే ఆనాడు బీసీల సంఖ్య ఏకంగా 61 శాతానికి చేరిందని స్పష్టం చేశారు. అలాంటిది పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వేలో బీసీల జనాభా 1.64 లక్షలకు ఎలా తగ్గిందని, 46 శాతానికి ఎలా పడిపోయిందో చెప్పాలని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. దశాబ్ద కాలంలో బలహీన వర్గాల జనాభా తగ్గినట్టు చూపిన ఈ తప్పుడు లెక్కలను ఎవ్వరూ నమ్మే పరిస్థితుల్లో లేరని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అసమగ్రంగా జరిగిన సర్వే పూర్తయిందని సాక్షాత్తూ దేశ అత్యున్నత చట్టసభలో పేర్కొనడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ధ్వజమెత్తారు.

**చూస్తూ ఊరుకోరు..** అసెంబ్లీ సమావేశాల సాక్షిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని తేలిపోయిందని కేటీఆర్ మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, చివరికి కాంగ్రెస్ పార్టీపరంగా మాత్రమే సీట్లు ఇస్తామని చేతులెత్తేయడం మోసం కాకపోతే మరేంటని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ చేసిన ఈ ద్రోహాన్ని చూస్తూ ఊరుకోవడానికి తెలంగాణలోని బీసీ సమాజం సిద్ధంగా లేదని రాహుల్‌ని లేఖలో హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని మీరిచ్చిన మాటను ఏడాది కాలంలోనే మంటగలిపి బీసీల గొంతు కోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా అబద్ధాలు ప్రచారం చేసి డిక్లరేషన్లకు ఘోరీ కట్టిన పాపం కాంగ్రెస్‌ను వెంటాడటం ఖాయమని అన్నారు.

**చేతులు దులుపుకుంటారా? :** తెలంగాణలో అమలు చేయని హామీలను, ఇక్కడి ప్రజలకు అందిస్తున్నట్టు ఎలా ప్రచారం చేసుకుంటారని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కులగణన సర్వేను అంశాన్ని ఇతర రాష్ట్రాల్లోనూ వాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే పార్లమెంట్‌లో దీని ప్రస్తావన తెచ్చారని ఆయన మండిపడ్డారు. కులగణన తప్పులను సవరించాల్సిన బాధ్యత మరిచి బంతిని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ బీసీ సంఘాల నేతలు ఏకంగా కులగణన నివేదికను చించివేసి నిరసన తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన అంతా తప్పులతడకేనని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలని అన్నారు. ఈ సర్వేతో బీసీలకు న్యాయం జరగకపోగా కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అన్యాయం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు.

**ఎలా తగ్గింది? :** పదేళ్లలో అగ్రవర్ణాల జనాభా పెరిగి, బీసీల జనాభా తగ్గడం ఎలా సాధ్యమో చెప్పగలరా? రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. వెనకబడిన వర్గాల భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన కోటాను తప్పులకుప్పగా తయారు చేయడం, కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఉన్న నిలువెత్తు నిర్లక్ష్యానికి అద్దంపడుతోందని అన్నారు. తప్పుడు లెక్కల వల్ల రానున్న రోజుల్లో ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్ గాంధీ మాట్లాడటం దారుణమన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసే ఈ ఫెయిల్యూర్ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని పార్లమెంట్‌లో రాహుల్ కోరడం మరో విడ్డూరమని అన్నారు.

**క్షమాపణ చెప్పాల్సిందే..** ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడే కాంగ్రెస్ నిజస్వరూపం ఏడాది కాలంగా అనేక రూపాల్లో బయటపడిందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. బీసీల జనాభాను తగ్గించి చారిత్రక తప్పిదం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలోని వెనకబడిన వర్గాలు ఎప్పటికీ క్షమించవని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్యారెంటీల పేరిట చేసిన గారడీని, డిక్లరేషన్ పేరిట చేసిన ఈ దగాను చూసిన తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లోనే కాదు.. ఏ ఎన్నికల్లోనూ ఇక కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ వేదికగా బీసీ డిక్లరేషన్ ఓ నాటకమని, బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ బూటకమని తేలిపోయిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ బీసీలకు రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు.




# మాజీ మంత్రి హరీశ్ రావుకు భారీ ఊరట..

## అప్పటివరకూ అరెస్టు చేయ్యొద్దంటూ ఆదేశాలు..

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావుకు మరోసారి ఊరట లభించింది. ఈ కేసులో హరీశ్ రావును ఫిబ్రవరి 12 వరకూ అరెస్టు చేయవద్దంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టును మాజీ మంత్రి ఆశ్రయించారు. క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు గతంలో విచారణ చేపట్టిన ధర్మాసనం ఆయన్ను అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా వాటిని పొగడిస్తూ ఈనెల 12 వరకూ అరెస్టు చేయవద్దని చెప్పింది. విచారణ సందర్భంగా ఈనెల 12న సీనియర్ లాయర్‌తో వాదనలు వినిపిస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడువు కోరారు. కాగా, ఇదే కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మ్నెదట వారు నాంపల్లి కోర్టును ఆశ్రయించగా.. బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో ఇద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పది నెలలుగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఈ మేరకు వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది హైకోర్టు. రూ.లక్ష పూచీకత్తుతో రెండు షూరిటీలూ సమర్పించాలని ఆదేశించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సైతం సమర్పించాలని చెప్పింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న దృష్ట్యా పోలీసులకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయ్యొద్దంటూ భుజంగరావు, రాధాకిషన్ రావును హైకోర్టు ఆదేశించింది.

# 'స్థానికం'పై దృష్టి పెట్టి...

## నేడు పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్, మున్షీ భేటీ..



## 'స్థానిక' ఎన్నికలపై దిశానిర్దేశం!!

హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. రెండువారాల్లో నోటిఫికేషన్ వస్తుందన్న వార్తలు హంగామా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ వేగంగా అడుగులు వేస్తోంది. గురువారం ఎమ్మెల్యేలతో సమావేశం కావాలని పార్టీ నిర్ణయించింది. ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ కూడా హాజరుకానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ చేసింది అధికార కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ నేతలు భావించిన మాదిరిగానే ముందుగా కులగణన రిపోర్టును అసెంబ్లీ పెట్టి చర్చించింది ప్రభుత్వం.

రాజ్యాంగం ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని కేంద్రం ఆమోద ముద్ర వేయాలి. లేకుంటే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు. ఎమ్మెల్యేలను జిల్లాల వారీగా నాలుగు గ్రూపులుగా విభజించనున్నారు. ఆ తర్వాత వారితో సమావేశం కానున్నారు. వీలైతే ఒక్కొక్కరితో ఇండివిడ్యువల్‌గా మాట్లాడే అవకాశమున్నట్లు గాంధీ భవన్ వర్గాల మాట.

తొలుత జిల్లాలు, నియోజకవర్గాల వారీగావున్న సమస్యలపై తొలుత చర్చించనున్నారు. ఎమ్మెల్యేల సమస్యలను తెలుసుకోనున్నారు. ఇదిలావుండగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది ఎమ్మెల్యేలు దానం ఇంట్లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో దానిపై కూడా చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వీలైతే బుధవారం లేదంటే గురువారం దీపాదాస్ మున్షీ హైదరాబాద్‌కు రానున్నట్లు పార్టీ వర్గాల మాట. ఎమ్మెల్యేలతో సమావేశం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ రావచ్చని అంటున్నారు కొందరు నేతలు.

అదే జరిగితే రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలపై నగారా మోగడం ఖాయమని అంటున్నారు. ఇవేకాకుండా పార్టీ పరంగా ఉన్న అంశాలను సైతం చర్చించనున్నట్లు అంతర్గత సమాచారం.

## సంపాదకీయం

# అమెరికాలో అక్రమంగా ఉన్న మనోళ్ల లెక్కంత?

రెండోసారి అమెరికా అధ్యక్షపదవిని చేపట్టిన రోజు నుంచే ఆ దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయుల మీద ట్రంప్ ఎంత కఠినంగా ఉన్నారో తెలిసిందే. ఇప్పటికే పలు దేశాలకు చెందిన వారిని వారి దేశాలకు పంపిన అమెరికా.. తాజాగా 205 మంది భారతీయుల్ని ప్రత్యేక విమానంలో పంపే యటం తెలిసిందే. సీ17 అనే సైనిక విమానంలో వారిని టెక్సాస్ లోని శాన్ ఆంటోనియో నుంచి పంజాబ్ లోని అమ్రుత్ సర్ కు వెనక్కి పంపారు. ఈ విమానం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరిన వైనాన్ని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. అమెరికా నుంచి బయలదేరిన ఈ విమానం మధ్యలో ఇంధనం నింపుకోవటానికి జర్మనీలోని రాంస్టీన్ లో ఆగింది. ఈ విమానం భారత్ కు చేరుకోనుంది. కాకుంటే.. ఈ విమానంలో తిప్పి పంపిన వైనంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విమానంలో గౌరప్రదంగా అయితే 140 మందికి మాత్రమే ప్రయాణించే వీలుంది. అందుకు భిన్నంగా 205 మందిని తరలించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. అఫ్గానిస్థాన్ లో తాలిబన్లు అధికారం చేపట్టిన వేళలో.. ఇలాంటి విమానాల్లో 600-800 మందిని తరలించిన వైనంతో పోలిస్తే.. ఇది తక్కువేగా అన్న వాదనను వినిపిస్తున్నాయి. అమెరికాకు మిత్రదేశంగా.. అత్యంత నమ్మకస్తుడి హెూదాలో ఉన్నప్పుడు ఇలా ఎలా వ్యవహరిస్తారు? అన్నది ప్రశ్నగా మారింది. ఇంతకూ అమెరికాలో చట్టవిరుద్దంగా ఉన్నమనోళ్లు ఎందరు? వారిని చట్టవిరుద్ధమైన పౌరులుగా ఎలా గుర్తిస్తారు? అన్న దానిపై పలువురికి ఉన్న సందేహాలకు సమాధానాలు వెతికితే.. పలు అంశాలు వెలుగు చూస్తాయి. ఇంతకూ ఎవరిని తిరిగి పంపించేస్తున్నారు? అన్న విషయాన్నిచూస్తే.. అమెరికాలో ఉండటానికి సరైన పత్రాలు లేని.. అక్రమంగా దేశంలోకి ఎంట్రీ అయిన వారిని తిరిగి పంపుతున్నారు. ఇలా తిప్పి పంపే వారి కోసం వాణిజ్య.. సైనిక అవసరాల కోసం వినియోగించే భారీ విమానాల్ని వినియోగిస్తున్నారు. మరి.. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులు ఎందరు? అన్నది మరో ప్రశ్న. దీనికి బ్లూంబర్గ్ అంచనా ప్రకారం 18వేల మంది వరకు భారతీయుల్ని ఇప్పటివరకు గుర్తించినట్లు చెబుతున్నారు. అమెరికా హెూంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407గా చెబుతునరు. వీరి నుంచి సరైన పత్రాలు లేవని చెబుతున్నారు. ఇందులో 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేసినట్లుగా చెబుతున్నారు. అయితే ఇవన్నీ 2022 నాటి లెక్కలని.. ప్రస్తుతం మరింత ఎక్కువ మంది ఉన్నట్లుగా భావిస్తున్నారు. పలు నివేదికల ప్రకారం అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయుల సంఖ్య దగ్గర దగ్గర 7,25,000 మంది ఉంటారని చెబుతున్నారు. ఇంత భారీ సంఖ్యలో భారత్ కు తిరిగి వస్తే.. అదో పెద్దతలనొప్పిగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవ కోణంలో అంత మందిని తరలించటం సాధ్యమేనా? అన్నది మరో ప్రశ్న.

# రాబోవు కీసర గుట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ గౌతం ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం...

### ముఖ్య అతిథులుగా హాజరైన చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి...




జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో దైవ దర్శనం కల్పించడంలో సామాన్య ప్రజలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల పై జరిగిన సమీక్షా సమావేశానికి ఎంఎల్ఎ మల్లారెడ్డితో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ఈ నెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని దైవదర్శనం కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలుఈ నెల 24 నుండి మార్చి 1 వ తేదివరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ ఉత్సవాలకు 6 నుండి 7 లక్షల మంది భక్తులు హాజరవుతారని, జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ బ్రహ్మోత్సవాలకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రితో మాట్లాడి తప్పకుండా అందిస్తామని అన్నారు. మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ మాట్లాడుతూ మన జిల్లాలో కీసర గుట్ట (కేసరగిరి) శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా, వైభవంగా జరుపుకుంటామన్నారు. ఈసారి కూడా బ్రహ్మోత్సవాలను ఘనంగా వైభవంగా జరుపుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. దైవ దర్శనానికి ఏర్పాటు చేసే 6 క్యూ లైన్ లలో మూడు క్యూ లైన్ లను సామాన్య భక్తులకు ఏర్పాటు చేసి వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని కలెక్టర్ ఆలయ అధికారులను ఆదేశించారు. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్లైన్ లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులకు త్రాగునీరు, నిత్యావసరాలు కావలసిన నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. 24 గంటలు పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతమంతా పరిశుభ్రాంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా తగిన రీతిలో బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి, అవసరమైన చోట మరుగుదొడ్ల మరమత్తులు, లేని చోట



తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరాయంగా విద్యుతు సరఫరా చేసి రహదారి వెంట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. కొలను దగ్గర గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. 24 గంటల పాటు అంబులెన్సులతో కూడిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ప్రాంతాల నుండి అదనపు బస్సులను, ఏర్పాటు చేయాలనీ ఆర్టీసీ అధికారులను సూచించారు. వయోవృద్ధులు, దివ్యంగులకు ఇబ్బంది కలుగకుండా వై జంక్షన్ నుండి దేవాలయం వరకు ఉచిత ఆటోలను, షెటిల్ బస్సులను ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడే సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలిసు శాఖ వారు తగిన బందోబస్తు ఏర్పాటు చేసి, అన్ని శాఖల సమన్వయం తో సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్ శాఖ వారు పర్యవేక్షించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలలో అగ్ని మాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. డిసిపి పద్మజ మాట్లాడుతూ కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహాణలో జిల్లా అధికారులందరు వారివారికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఏర్పాట్ల నిర్వహాణలో ఏవైన సమస్యలు వస్తే సంబంధిత శాఖలు సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లురాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, కీసర ఆర్డిఓ వెంకట ఉపేందర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఆలయఈఓ సుధాకర్ రెడ్డి, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరు పాల్గొన్నారు.

## మండల పరిషత్‌లో జాబ్ మేళా

శామీర్ పేట, (గరుడ వార్త) : ఈనెల 8వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లుగా ఎంపీడీవో మమతా బాయి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8 న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శామీర్ పేట లోని 7 గ్రామ పంచాయతీల లోని 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ, యువకులు సంబంధింత ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. పలు సంస్థల నుంచి ప్రతినిధులు విచ్చేసి ఈ జాబ్ మేళాలో యువతీ, యువకులను ఎంపిక చేస్తారన్నారు. అర్హత గల యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని తమ ప్రతిభ చాటుకొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. 7వ తరగతి, 8వ తరగతి, టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, ఎంబీఏ అర్హతలు



గల యువతీ, యువకు లు హాజరు కాగలరని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డిఆర్డిఏ జిల్లా మేనేజర్ ను 6281739511 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

# పేదల్లో చిగురిస్తున్న ఆశలు

నర్సాపూర్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కొన్నేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పనులు చేసిన గుత్తేదార్లకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో అసంపూర్తిగా నిలిపివేశారు. ఎట్టకేలకు ఇటీవల కొంత మొత్తం చెల్లింపులు చేయడంతో పనులు పునఃప్రారంభం అవుతాయని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. నిర్దేశించిన కాల పరిమితిలో పూర్తి కావాల్సిన ఇళ్ల నిర్మాణాలు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని కొసరు పనులతో, మరికొన్ని స్లాబులు, గోడల పనులతో అసంపూర్తిగా ఉంటున్నాయి.

**రూ.1.02కోట్ల బిల్లుల కేటాయింపు**

నర్సాపూర్‌లోని ఏఎంసీ వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న 248 ఇళ్ల పనులు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు గడువులు విధిస్తూ వస్తున్నారు. గడువు దాటిపోతున్నా నేటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. పనులు అడపాదడపా సాగుతున్నాయి. వీటిల్లో 140 ఇళ్ల స్లాబులు పూర్తయ్యాయి. 64 ఇళ్లల్లో ఇటుక గోడలు పూర్తయ్యాయి. 38 ఇళ్లకు పిల్లర్లు వేశారు. కొన్ని గ్రౌండ్ ఫ్లోర్ స్లాబులతో సరిపెట్టారు. ఇలా వివిధ దశల్లో కొనసాగుతున్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు చేపట్టిన గుత్తేదారుకు ఇటీవల రూ.1.02కోట్ల బిల్లు మంజూరైందని పీఆర్ అధికారులు తెలిపారు. దీంతో ఈ పనులన్నీ పునఃప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వక...**

నర్సాపూర్‌లో రెండు చోట్ల ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ విపణికి ఎదురుగా 256 ఇళ్లు, వెనకాల మరో 248 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో ఏఎంసీ ముందు నిర్మించిన ఇళ్ల పనులు దాదాపు పూర్తికావచ్చాయి. కొసరు పనులతో దర్శనమిస్తున్నాయి. అయితే అధికారులు వీటికి బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. చిన్నపాటి పనులు పూర్తిచేస్తే పేదలకు ఇవి అందుబాటు



లోకి వస్తాయి. వీటిని కాదని ఏఎంసీ వెనక భాగంలో నిర్మించిన వాటికి బిల్లులు కేటాయించడం వివాదస్పదమవుతోంది. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలకు అద్దాలు అమర్చడం వంటి పనులు చేయాల్సి ఉంది. పనులు చేసిన గుత్తేదారుకు రూ.35లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీటిని చెల్లిస్తేనే మిగతా పనులు పూర్తి చేస్తానని గుత్తేదారు కొసరు పనులను నిలిపివేశారు. బిల్లుల చెల్లింపు పూర్తయితే తప్ప విద్యుదీకరణ, రంగులు వేయడం వంటి పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

**పునఃప్రారంభానికి చర్యలు -భాస్కర్, ఏఈపీఆర్**

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పనులను పునఃప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఏఎంసీ వెనక భాగంలో ఇళ్లు నిర్మించిన గుత్తేదారుకు రూ.1.02కోట్ల బిల్లు మంజూరైంది. ఇందులో రూ.25లక్షల బిల్లును ఈఈ ఆపాలని నిర్ణయించారు. మధ్యలో ఆపేసిన పనులను పునఃప్రారంభిస్తేనే మిగతా బిల్లును ఇవ్వాలని నిర్ణయించాం. ఏఎంసీ ముందు భాగంలో చేపట్టిన ఇళ్లకు సంబంధించి బిల్లు విడుదలలో తీవ్ర జాప్యం వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# ఆ నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయొచ్చు: హైడ్రా

హైదరాబాద్: చట్టాలను పాటిస్తూ, న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే నగరంలోని నీటి వనరులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలను తొలగిస్తున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఖాజాగూడలో హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను రంగనాథ్ వెల్లడించారు. భగీరథమ్మ చెరువు, తౌతోనికుంటలో ఆక్రమణల తొలగింపునకు జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 405 ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్న రంగనాథ్.. ఇటీవల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా కూడా మానవత్వంతో భగీరథమ్మ చెరువు, తౌతోనికుంటలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించిన వారికి గత వారమే నోటీసులు ఇచ్చామని, హైడ్రా కార్యాలయానికి పిలిచి గూగుల్ ఎర్త్ మ్యాప్‌ల ఆధారంగా ఆక్రమణల విషయంపై స్పష్టంగా వివరించి 3..4 రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించినట్టు వివరించారు. అయినా, ఖాళీ చేయకపోవడంతో డిసెంబరు 30న మరోసారి నోటీసులు ఇచ్చి డిసెంబరు 31న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించినట్టు రంగనాథ్ వెల్లడించారు. ఈ ఆక్రమణలకు సంబంధించి కొంత మంది హైడ్రాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని రంగనాథ్ తీవ్రంగా ఖండించారు. భగీరథమ్మ, తౌతోనికుంటలోకి వెళ్లాల్సిన వరద నీరు ఆక్రమణల వల్ల తమ నివాసాల్లోకి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడి ఓ కార్పొరేట్ సంస్థ యజమానితోపాటు శిఖం పట్టాదారులను కూడా హైడ్రా కార్యాలయానికి పిలిచి సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఆక్రమణల విషయాన్ని సమగ్రంగా వివరించాకే నోటీసులు జారీ చేసినట్లు రంగనాథ్ తెలిపారు.



**హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం..**

హైదరాబాద్ ఖాజాగూడలోని బ్రహ్మనికుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు జారీ చేసి 24 గంటలు గడవకముందే కూల్చివేతలు చేపట్టడమేమిటని నిలదీసింది. దీనిపై గతంలో హైడ్రా కమిషనర్‌కు స్పష్టంగా చెప్పినా మళ్లీ అదే కొనసాగిస్తున్నారని, ఇలాగైతే మరోసారి కోర్టుకు పిలిపించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఖాజాగూడలో చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతమంటూ నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ మేకల అంజయ్య తదితరులు మంగళవారం అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారించాలంటూ (లంచ్ మోషన్) పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నం.18/ఇలో 12640 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారన్నారు.

హైడ్రా తరఫు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైడ్రా అధికారులు అక్కడ విచారించిన తరువాతే చర్యలు చేపట్టారన్నారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అనుమతుల్లేకుండా పిటిషనర్లు నిర్మాణాలు చేపట్టారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని న్యాయవాది చెప్పగా.. 24 గంటలే సమయం ఇస్తారా అంటూ న్యాయమూర్తి నిలదీశారు. కనీసం బాధితుల వివరణ తీసుకోకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని అన్నారు. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారా అని ప్రశ్నించారు. తాజాగా నోటీసులు జారీ చేసి పిటిషనర్ల వివరణ తీసుకున్నాక.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా పిటిషనర్లు ప్రహరీ సహా ఏవైనా నిర్మాణాలు చేపట్టినట్లయితే వాటిని జీహెచ్ఎంసీ కూల్చివేయవచ్చని పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు.

# సైబర్ నేరాలపై సాంకేతిక అస్త్రం

హైదరాబాద్: ముల్లును ముల్లుతోనే తీయాలన్నది నానుడి. సాంకేతికతను ఆధారంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.వేల కోట్లు కొట్టేస్తున్నారు. ఇతరుల పేరుతో(మ్యూల్) సిమ్‌కార్డులు తీసుకుని సందేశాలు పంపిస్తూ, కాల్స్ చేసి భయపెడుతూ ఖాతాలో డబ్బంతా ఖాళీ చేస్తారు. ఈ నకిలీ వెబ్‌సైట్లు, యూఆర్‌ఎల్‌ల భరతం పట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) సాంకేతిక అస్త్రం ప్రయోగిస్తోంది. నేరగాళ్లను మాత్రమే అరెస్టు చేయకుండా.. వారు ఉపయోగించే వెబ్‌సైట్లు, సిమ్‌లు, ఫోన్లు పనిచేయకుండా నిర్వీర్యం చేస్తోంది. ఈ ఏడాది దాదాపు 25వేల సిమ్‌లు, ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేసింది. 1825 నకిలీ వెబ్‌సైట్లను నిర్వీర్యం చేసింది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని రెండు విభాగాలతో ఇది సాధ్యమవుతోంది.

**డేటా అగ్రిగేషన్ అనాలసిస్ యూనిట్**

సైబర్ నేరగాళ్లు ఉపయోగించే ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు, ఈమెయిల్ ఐడీ, వెబ్‌సైట్లు, యాప్‌లు తదితరాలపై డేటా అగ్రిగేషన్ అనాలసిస్ యూనిట్ దృష్టి సారిస్తుంది. నేరం జరిగినప్పుడు లభించే సాంకేతిక ఆధారాలతో గూగుల్, ఇతర సామాజిక మాధ్యమ సంస్థలు, టెలికాం ఆపరేటర్లను సంప్రదించి ఈ నకిలీ డేటా మూలాలు సేకరిస్తారు. ఇప్పటివరకు దాదాపు 50 వేలకుపైగా యూఆర్‌ఎల్, 40 వేలకుపైగా సిమ్‌కార్డులనును విశ్లేషించినట్లు అధికారులు తెలిపారు.

**థ్రెట్ ఇంటలిజెన్స్ యూనిట్** ఎప్పటికప్పుడు కొత్తగా జరిగే సైబర్ నేరాల తీరును గమనిస్తూ అప్రమత్తం చేయడం, నిందితులు వాడే వెబ్‌సైట్లు, యాప్, సామాజిక మాధ్యమ ఖాతాలు పనిచేయకుండా నిర్వీర్యం చేయడం ఈ విభాగం పని. ఉదాహరణకు కారు షోరూం డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ నేరగాళ్లు నకిలీ సామాజిక మాధ్యమ ఖాతానుంచి వెబ్‌సైట్ లింకు పంపి డబ్బు వసూలు చేస్తుంటారు. ఈ సమాచారం ఆధారంగా థ్రెట్ ఇంటెలిజెన్స్ విభాగం నకిలీ సామాజిక మాధ్యమ ఖాతా, వెబ్‌సైట్‌ను గుర్తించి.. వాటిని తొలగించాలని సంబంధిత సంస్థలకు లేఖ రాస్తుంది. కొత్తగా అందుబాటులోకి వచ్చే అనుమానాస్పద యాప్‌లు, వాటితో చేసే మోసాలనూ గమనిస్తుంటుంది.

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# సమస్యల స్వాగతం

కొడిమ్యాల : కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఏటా అయిదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు, జాతర నిర్వహిస్తున్నా భక్తులకు సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జాతరకు తరలివచ్చే భక్తులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

పారిశుద్ధ్య లోపం..భోజనాల అనంతరం పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వ్యర్థాలు, చెత్తను ఆలయ ఆవరణలోనే పడేస్తున్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు అశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. ఉత్సవాల సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్ల నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ఆలయానికి వచ్చే మహిళలు అవస్థలు పడుతున్నారు. ఉత్సవాల సమయంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నా ఉపయోగంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీళ్ల ట్యాంకుకు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు, చెత్త

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు...గుట్టపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డుకు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రమాదవశాత్తు అదుపుతప్పి వాహనాలు పడిపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఘాట్ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. జాతర సమయంలో ఆలయ పరిసరాల్లోకి రాకుండా పోలీసులు వాహనాలను నిలిపివేస్తారు. ఇదే అదనుగా కొందరు ఆలయ సమీపంలో ప్రైవేటు ప్రార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి పార్కింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు**

బ్రహ్మోత్సవాలు, జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్ చేయిస్తాం. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు ఉన్నవాటిని వినియోగంలోకి తెస్తాం. ఘాట్‌రోడ్డుపై మట్టి పోయించి గుంతలు పూడ్చివేసి మరమ్మతు చేయించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.వెంకన్న, ఈవో

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# సమస్యలకు చికిత్స చేయండి





కరీంనగర్ : నన్ను అందరూ పెద్ద దవాఖానా అని పిలుస్తారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో నిధులు లేక నిరుపేదగా మారాను. నన్ను నమ్ముకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులతోపాటు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని కొంతమంది ఇక్కడకు వస్తుంటారు. రెండేళ్ల కిందట వైద్య విధాన పరిషత్‌లో ఉన్న నన్ను వైద్య కళాశాలలోకి మార్చారు. జిల్లావాసులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందిస్తానని ఆశించాను. కానీ నిధులు లేకపోవడంతో రోగిగా మారాను. జిల్లాయంత్రాంగం, ప్రజాప్రతినిధులు నా సమస్యను అర్థం చేసుకొని నిధులు కేటాయిస్తారని లేఖ రాస్తున్నాను. ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నా దగ్గర ట్రామా కేర్ లేకపోవడంతో సుమారు 4000 మంది తీవ్రగాయాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఆ సేవలు అందుబాటులో లేక ప్రైవేట్ దవాఖానాకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు.

జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి పెరిగిపోతోంది. నా వద్ద సరైన సేవలు లేకపోవడంతో.. ఉమ్మడి జిల్లాలోని సుమారు 90 వేల మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పేదోడి గుండెపోటుతో నా గుండె పగులుతోంది. నా వద్ద చికిత్స లేక ఉన్నతాసుపత్రికి తీసుకెళ్లడానికి సమయం లేక ప్రైవేట్‌లో చేరి గుండెలు కరిగేలా రోదిస్తున్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉండటం నాకే 'వ్యర్థ'మనిపిస్తోంది. బిల్లులు చెల్లించాలనే సరికి చిన్న ఆసుపత్రిలా 'లెక్క'లు కడుతున్నారు. వారికి పెద్ద ఆసుపత్రిలా కనిపించడం లేదా? అని అనిపిస్తుంది. 542 పడకల ఆసుపత్రికి 330 పడకలకు మాత్రమే పారిశుద్ధ్య బిల్లు చెల్లిస్తున్నారంటే అధికారులకు నాపై ఎంత అ'శ్రద్ధ' పెట్టారో అర్థమవుతోంది.

వైద్యుల చేతిలో పరికరాలు లేకపోవడంతో వారు శస్త్రచికిత్స గదిలో చెందుతున్న ఆవేదన చూసి నాకెప్పుడు 'శస్త్రచికిత్స' చేస్తారో అని మదనపడిన రోజులెన్నో. నా వద్ద సేవలందక మా పెద్దాసుపత్రి వరంగల్‌కు పంపుదామంటే అంబులెన్సులు లేవు. మరమ్మతుల్లేక మూలన పడి ఉన్నాయి.నాలోని యంత్రాలు సరిగా పనిచేయడం లేదు. ఎక్స్‌రేలకు ఫిల్మ్‌లు, పరీక్షలకు ప్రింటెడ్ నివేదికలు ఇవ్వడానికి డబ్బులు లేకపోవడంతో ఎంత పనిచేసిన నాకు గుర్తింపు రావడంలేదనే ఆవేదన మిగిలింది. జిల్లాలో పేరుమోసిన ప్రజాప్రతినిధులున్నా..నన్ను పట్టించుకునేవారు లేరు.ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కున ఉన్న నాకు దయచేసి కిడ్నీ, గుండె, న్యూరో, క్యాన్సర్, వైద్యులతోపాటు ఎంఆర్ఐ, సీటి, అబ్డామిన్, ఎక్సరే, యంత్రాలు, శస్త్రచికిత్స గది 24 గంటలు పనిచేసేలా నిధులు మంజూరు చేయగలరని కోరుకుంటున్నాను.

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**


ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# చెత్త శుద్ధీకరణపై ఆశలు

కరీంనగర్ : నగరంలోని డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. నిత్యం టన్నుల కొద్ది వస్తున్న చెత్త ఎక్కడ వేయాలనే ప్రశ్నకు జవాబే లేదు. రెండేళ్ల కిందట ప్రారంభించిన బయోమైనింగ్ పూర్తి స్థాయి పరిష్కారానికి దారి చూపించలేక పోయింది. 'కరీంనగర్ నగర ప్రజల ప్రధాన సమస్య డంపింగ్‌యార్డు అని అర్థమైంది. దీనిని పరిష్కరించేందుకు సాంకేతికతతోపాటు నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. కేంద్ర మంత్రి హామీతోనైనా సమస్య పరిష్కారం కావాలని నగరవాసులు కోరుకుంటున్నారు.చెత్త నిండిపోవడంతో డంపింగ్‌యార్డు నుంచి మంటలు రావడం, పొగ వ్యాపించడంతో పరిసరాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కోతిరాంపూర్, అలుగునూర్, రామగుండం బైపాస్‌రోడ్డు, పోచమ్మవాడ, అలకాపురికాలనీ, కమాన్ ప్రాంతం వరకు వాసన వస్తోంది. దీనిని ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 31 నెలల కిందట రూ.16.50 కోట్లతో బయోమైనింగ్ ప్రారంభించారు. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ప్రక్రియ నిలిచిపోయింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనుల పురోగతి మాత్రం కనిపించడంలేదు. శుద్ధి చేసిన చెత్త వేసేందుకు కూడా స్థలం లేకపోవడం, రోజు వారీ వ్యర్థాలను అందులోనే కలిపి వేయడంతో శుద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారింది.ఇతర రాష్ట్రాల్లో చెత్తను శుద్ధి చేసి తరలిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా సాంకేతికను జోడించి వ్యర్థాలను తరలించే అవకాశముంది.



ప్రస్తుతమున్న నిల్వలతోపాటు నగర వీధుల్లోంచి చెత్తను ఎప్పటికప్పుడు శుద్ధి చేసేలా ప్రణాళికలు చేయనున్నట్లు సమాచారం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కూడా ఈ డంపింగ్‌యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతోనే కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలి. తడి చెత్తను సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగించవచ్చు. మరోవైపు హుజూరాబాద్‌లో పొడి చెత్తతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా చేశారు. ఆ ప్రక్రియ పూర్తయితే డంపింగ్ యార్డులోని చెత్త నిల్వలు తగ్గుముఖం పడతాయని అధికారులు భావిస్తున్నారు. కరీంనగర్‌లోని డంపింగ్‌యార్డు

డివిజన్లు : 60

నగర విస్తీర్ణం : 65.33 చ.కిమీ

ఇళ్ల సంఖ్య : 89 వేలు

చెత్త ఉత్పత్తి : 140 మెట్రిక్ టన్నులు(రోజుకు)

పేరుకుపోయిన వ్యర్థాలు : 3 లక్షల టన్నులు

శుద్ధి చేసింది : 80 వేల మెట్రిక్ టన్నులు

# సహకార సంఘాలకు ప్రత్యేక పాలన తప్పదా?

కరీంనగర్ : సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటివరకు నిర్ణయానికి రాలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఊసేలేదు. 2020 ఫిబ్రవరి 13న ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత రోజు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాల సభ్యులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం సైతం ఈనెల 14న ముగియనుంది.

**రెండు నుంచి మూడు సంఘాలకు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2-3 సంఘాలకు ఒక మండల స్థాయి అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. కొత్త జిల్లాల స్థాయిలో సహకార బ్యాంకుల విస్తరణ ఉండకపోవచ్చని తెలుస్తుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినపుడు ఆయా జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులను విస్తరించాలని ప్రభుత్వం సూచించింది.

**బ్యాంకుల విస్తరణ ఏమైనట్టు..**

జిల్లాలో సహకార బ్యాంకులు విస్తరించాలనే ప్రతిపాదనలు పంపినా..



నేటికి స్పందన రాలేదని తెలుస్తోంది. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు పొందే విషయంలో ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తరించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**కొత్తగా 39 సంఘాలు?**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో 135 సహకార సంఘాలకు తోడుగా మరో 39 సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల సహకార అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని ఏర్పాటు చేసిన తర్వాతే ఎన్నికలు జరగవచ్చనే ప్రచారం జరుగుతోంది.

**ఆదేశాలు రావాల్సి ఉంది**

సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. వారి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించే విషయంలో ఆదేశాలు రాలేదు. అలాగే కొత్త సంఘాల ఏర్పాటు విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు చేయలేదు. ఎన్నికల విషయంలో ఆదేశాలు వస్తేనే ప్రక్రియ ప్రారంభిస్తాం.రామానుజాచార్యులు, జిల్లా సహకార అధికారి

# ప'రేషన్..'!

పెద్దపల్లి : జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లోని రేషన్ సరకులకు దూర భారం తప్పడం లేదు. కిలోమీటర్లు కాలినడకన వెళ్లి సరకులు తీసుకొచ్చే పరిస్థితి నెలకొంది. అయిదేళ్లుగా కొత్త చౌక ధరల దుకాణాల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ప్రతి నెల సమీపంలోని గ్రామాల రేషన్ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ సభలు, సమావేశాల్లో విన్నవించిన ప్రజల విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. పూర్వ పంచాయతీల్లో నుంచి సరుకులు తీసుకురావడంతో సక్రమంగా అందడంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దుకాణాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లాలో ఇలా..**

14 మండలాల్లో 413 రేషన్ దుకాణాలున్నాయి. జిల్లాలో ఆహారభద్రత 2,07,231, అంత్యోదయ 12,290, అన్నపూర్ణ 156 మొత్తం 2,19,677 కార్డులున్నాయి. వీటిలో 6,25,090 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. అంత్యోదయ కార్డుకు నెలకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి నెల 322.31 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి.

**ప్రతిపాదనలకు మోక్షం కరవు**

జిల్లాలో మొత్తం 267 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 65 కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో ప్రతి నెల రేషన్ సరకులు తెచ్చుకునేందుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు కానీ.. అయిదేళ్లు దాటినా ఆచరణ సాధ్యం కావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో తక్కువ రేషన్‌కార్డులు ఉన్నాయని.. ఇలాంటి చోట్ల రేషన్ దుకాణాల మంజూరు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. అయితే రేషన్ దుకాణాలు లేని ఊళ్లలోకి డీలర్లు సరకులు తీసుకెళ్లి పంపిణీ చేయాలని గతంలో ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ఎవరు ఎక్కడ పంపిణీ చేయాల్సి ఉంటుందో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లకు దిశానిర్దేశం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఆశించిన మేర పర్యవేక్షణ కొరవడటం, డీలర్లు ప్రాథమిక ఆదేశాలను విస్మరించడంతో కొత్త గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇది పెద్దపల్లి మండలం బొంపెల్లి పంచాయతీ పరిధిలోని మేరపల్లి. ఇక్కడ రేషన్ దుకాణం మంజూరు చేయాలని గ్రామస్థులు ప్రజావాణిలో కోరారు. స్థానికంగా చౌకదారుల దుకాణం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇవీ సమస్యలు

పూర్వ పంచాయతీ దూరం ఉండటంతో సరకులు తీసుకోవడం కష్టసాధ్యమవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

వినియోగదారులకు ఎప్పుడు పంపిణీ చేస్తారో సమాచారం కొరవడుతోంది.

డీలర్ల వద్దకు సమయానికి వెళ్లకపోవడంతో సరకులు కోల్పోవాల్సి వస్తోంది. పేదలు, దివ్యాంగులు, వృద్ధులు కష్టాలు పడుతున్నారు.

సరకులు తీసుకోవడం ఇబ్బందిదాడి సంతోష్, మేరపల్లి, పెద్దపల్లి మండలం

మా గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడతో బొంపెల్లికి వెళ్లి తీసుకొస్తున్నాం. చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. సమాచార లోపంతో పేదలకు నిత్యావసర సరకులు అందడం లేదు.

# సమయపాలనే.. విజయానికి సోపానం

మిర్యాలగూడ : ఒక తరగతిలో 50 మంది విద్యార్థులుంటే.. పరీక్షల్లో అందరూ ఒకే రకమైన మార్కులు సాధించలేరు. ఏదేని ఒక ఉద్యోగ అర్హత పరీక్షలో సైతం అందరూ ఉద్యోగాలు సాధించలేరు. వీరిలో అనేక మంది ఒకే విధమైన పుస్తకాలు చదివినప్పటికీ ఒకే రకమైన ఫలితాలు సాధించబోరు. దీనికి ప్రధాన కారణం వారు రూపొందించుకున్న ప్రణాళిక, ఆ ప్రణాళికలను అమలు చేసే తీరు.. సమయపాలన. ఏ రంగంలో విజయం సాధించాలన్నా..కష్టపడడం ఒక్కటే కాకుండా..విజయానికి కావాల్సిన అన్ని రకాల వనరులు సక్రమంగా సమకూర్చుకోవాలి. వీటిలో ప్రధానమైన వనరు సమయం. అనేక మంది తమకు సమయం లేదు..అనే మాటను తరచూ ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం అనేక రంగాల్లో అద్భుతాలు సాధించిన వ్యక్తులకు..వరుసగా అపజయాలు చవిచూస్తున్న వారికి రోజులో 24 గంటలు మాత్రమే ఉంటాయి. ఆ సమయాన్ని వినియోగించుకునే తీరు..ఏ పనికి ఎంత సమయం కేటాయించాలనే ప్రణాళిక ఉంటే విజయం సాధించడం అంత కష్టమేమీ కాదు.

**త్వరలో పరీక్షలు, ఉద్యోగ నోటిఫికేషన్లు...**

రాష్ట్రంలో మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల కోసం రెండు, మూడు నెలల్లో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. వీటిలో డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్-1, గ్రూప్-2 తదితర పోస్టులు ఉండనున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2 లక్షల మందికి పైగా



వివిధ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా..సుమారు 5వేల మందికి పైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

**సామాజిక మాధ్యమాలను వీడండి..**

ప్రస్తుతం సమాజంలో రాజ్యమేలుతున్న సామాజిక మాధ్యమాలకు ఎంత దూరంగా ఉంటే అంత సమయం మిగులుతుంది. పరీక్షలు, చదువుకు ఉపయోగపడే వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాలను రోజులో కొంత సమయం కేటాయిస్తూ..ఆ సమయాన్ని కచ్చితంగా అమలు చేయాలి. మిగిలిన అన్ని మాధ్యమాలను కనీసం పరీక్షలు పూర్తయ్యే వరకైనా పక్కన పెట్టాలి. అనవసర ఫోన్ కాల్స్, కాలక్షేప పనులు విడిచిపెట్టాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండే అనేక మంది తమ లక్ష్యాల సాధనలో విజయాలు సాధిస్తున్నారు.

సమయం సద్వినియోగానికి నియమాలు..

ముందస్తు ప్రణాళిక రూపకల్పన

పనులకు ఆటంకం కలిగించే వాటిని దూరం పెట్టాలి.

ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలి.

ఒకేసారి ఎక్కువ పనులు చేస్తూ ఒత్తిడికి గురికావొద్దు.

మీ లక్ష్యాలను దెబ్బతీసే పనులకు దూరంగా ఉండాలి.

చరవాణి పక్కన పెట్టి:

యరెడ్ల వేణుధర్‌రెడ్డి, సహాయ మేనేజర్ (హెచ్‌ఆర్) -జెన్కో (మిర్యాలగూడ)

2018లో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలకు ముందు మూడు నెలల పాటు చరవాణిని పక్కన పెట్టి చదువుకు మాత్రమే సమయాన్ని కేటాయించాను. ఒక ప్రణాళిక రూపొందించుకుని రాత్రి వేళలో తగినంత నిద్రపోవడంతో పాటు..రోజు మొత్తంలో ఏకాగ్రతతో 10 నుంచి 12 గంటల పాటు చదివాను. ఎంత సేపు చదివామనే దానికంటే..ఎంత ఏకాగ్రతతో చదివామన్నదే ఉద్యోగ సాధనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏ పుస్తకాలు చదువుతున్నాం, పరీక్ష సమయానికి అనుకూలంగా సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా చదువుతూ ఉద్యోగ అర్హత పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాను.

సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గాలి:

చారుగుండ్ల రాజశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కోదాడ

ప్రస్తుత రోజుల్లో స్మార్ట్‌ఫోన్ లేని విద్యార్థి లేరు..సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు లేని వ్యక్తి లేడు అంటే అతిశయోక్తి కాదు. అయితే పరీక్షల సమయంలో ఈ సామాజిక మాధ్యమాల వినియోగాన్ని ఎంత మేర తగ్గిస్తే అంత మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో పాటు ఒక టైమ్ టేబుల్ ఏర్పాటు చేసుకుని..పరీక్ష తేదీల ప్రకటనకు ముందే సిలబస్ పూర్తి చేసుకుని..తేదీల ప్రకటన తర్వాత రివిజన్‌పై దృష్టి సారిస్తే విజయం సాధించడం సులభమవుతుంది.

# నిధులున్నా.. నిర్లక్ష్యమే..!

నల్గొండ : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. విడతల వారీగా ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)ను మంజూరు చేస్తోంది. సీసీ రహదారులు, మురుగు కాల్వలు, సామాజిక భవనాలు, ప్రభుత్వ స్థలాలకు ప్రహరీలు, తాగునీరు, విద్య, వైద్యం తదితర అవసరాలకు వీటిని వినియోగించాలి. నిధులున్నప్పటికీ... క్షేత్రస్థాయిలో పనులు నెమ్మదించాయి. బిల్లులు సకాలంలో రాకపోవడంతో గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదని సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు. గతేడాదికి సంబంధించిన పనులు పూర్తి కాకపోయినప్పటికీ..ఇటీవల ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మంజూరైన పనులు: 1337.. పూర్తి: 51జిల్లా వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌డీఎఫ్ ద్వారా 1337 పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 51 మాత్రమే పూర్తయ్యాయి. 89 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# పది ఫలితం.. లక్ష్యం శతశాతం



సంగారెడ్డి : పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు కేటాయించిన పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలి. పదో తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించాలి. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా.. విద్యార్థులు ఎలా చదువుతున్నారు.. ఉపాధ్యాయులు వారిని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేస్తున్నారనే విషయాలపై ప్రధాన దృష్టి సారించాలి. ఆయా వివరాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో సమర్పించాలి. ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చర్యలు చేపట్టాలి.

**వారంలో రెండు రోజులు..**

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాలు 239 ఉన్నాయి. వీటికి ప్రత్యేకాధికారులను నియమించారు. వారు కేటాయించిన బడుల్లో వారంలో రెండు రోజులు పర్యటించాలి. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి ఉపాధ్యాయుల బోధన ఎలా ఉంది.. పిల్లలు చదువుతున్నారో తెలుసుకోవాలి. పదో తరగతి విద్యార్థుల కోసం విద్యాశాఖ ప్రకటించిన ప్రణాళిక అమలు, నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల సద్వినియోగంపై ఆరా తీయాలి. సాయంత్రం అల్పాహారం పంపిణీపై వివరాలు సేకరించాలి. ప్రాక్టీస్-1 పరీక్షలు ఈ నెల 4న ముగియనున్నాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఎన్ని మార్కులు సాధించారో పరిశీలించాలి. వెనుకబడిన వారికి ప్రత్యేక బోధన చేసేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలకు విద్యార్థులు హాజరు కాకుంటే.. ఎందుకు రావడంతో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడేలా సూచించాలి. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని చదివిస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని ప్రత్యేకాధికారులు గమనించాలి. వారికి కేటాయించిన పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలు 10 జీపీఏ సాధించడంతో పాటు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి. తనిఖీ నివేదికలను కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు పంపించాలి.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ:**వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ప్రతి పాఠశాలకు ప్రత్యేకాధికారిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు వారంలో రెండు రోజులు కేటాయించిన పాఠశాలలకు వెళ్లాలి. విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా సూచనలు చేయాలి. శతశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాలు: 239

వాటిలో పదో తరగతి విద్యార్థులు: 12472

# 'అపార్' ఆరో స్థానం



సిద్దిపేట: జిల్లాలో 'అపార్' నమోదు వేగవంతమైంది. రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచింది. మొత్తం 49.26 శాతం మేర ప్రక్రియ పూర్తయింది. మరోవైపు జిల్లాలో జూనియర్ కళాశాలలు చివరి స్థానంలో నిలిచాయి. మొత్తం 1,82,669 మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పటి వరకు 89,978 మంది నమోదు పూర్తయింది. ఇంకా 92,691 మంది మిగిలి ఉన్నారు. శతశాతం పూర్తయిన జాబితాలో 30 పాఠశాలలు ఉండటం గమనార్హం. 15 రోజులుగా వేగవంతమవగా.. ప్రభుత్వ పాఠశాలలు ముందు వరుసలో నిలిచాయి. ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

**భవిష్యత్తులో అనివార్యం**

రెండో తరగతి మొదలు ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు చేపట్టారు. 'వన్ నేషన్ - వన్ స్టూడెంట్'లో భాగంగా విద్యార్థి సర్వ సమాచారాన్ని నిక్షిప్తం చేసే ఈ క్రతువును గత సెప్టెంబరు 25 నుంచి చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో కీలకంగా మారనున్న 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు పొందడం అనివార్యం. జేఈఈ, నీట్, ఇతరత్రా పరీక్షలు రాయాలంటే అపార్ ఐడీ అవసరమంటూ ఇటీవల ఎన్‌టీఏ ప్రకటించింది. జిల్లాలోని జూనియర్ కళాశాలలు వెనుకబడి ఉండటం గమనార్హం.

**'ఆధార్' కేంద్రాల వద్ద ఆపసోపాలు**

అపార్ జారీలో భాగంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థి పేరు, ఇంటి పేరు, జెండర్ పక్కాగా ఉండాలి. అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. మరింత వేగంగా ముందుకు సాగేలా.. యాజమాన్యాలు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆధార్ కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆపసోపాలు పడుతున్నారు. సరైన ధ్రువపత్రాలు లభించక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

**సవరణ ముగిసినట్టేనా**

పాఠశాలల్లోని అడ్మిషన్ రికార్డుల్లో అక్షర దోషాల సవరణకు శుక్రవారం (జనవరి 31వ) చివరి రోజుగా అధికారులు నిర్ణయించారు. పీఎస్, యూపీఎస్ స్థాయిలో ఎంఈవోలకు అవకాశం కల్పించగా.. ప్రత్యేకించి ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు సంబంధించి డీఈవో నేతృత్వంలో సంబంధిత సవరణ (యూడైస్‌ం సైట్ వేదికగా) జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 119 సదరు విద్యాలయాలు ఉండగా.. చివరి ఒక్క రోజులో 23 పాఠశాలల నుంచి వందల సంఖ్యలో సవరణకు దరఖాస్తులు వచ్చినట్లు సవరణ విభాగం అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరిన్ని పాఠశాలల్లో సవరణలు ఉన్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో తరువాత పరిస్థితి ఏమిటా అనే ప్రశ్న తల్లిదండ్రుల్లో ఉత్పన్నమవుతోంది. విద్యార్థి సాధించిన అంశాలు అపార్‌లో నమోదవుతాయని, అన్ని ధ్రువపత్రాల జారీకి ఇదే కీలకం కానుందని.. అన్ని విద్యాసంస్థలు నమోదు చేపట్టాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, గణాంక విభాగం అధికారి నర్సింలు తెలిపారు.

# మారుమూల రోడ్లకు మహర్దశ



నర్సాపూర్: మారుమూల తండాల రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులతో మట్టి, కంకర రోడ్లు తారుగా మారుతుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శివ్వంపేట మండలంలో పలు తండాల్లో తారు రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

**భారీగా నిధులు మంజూరు**

నర్సాపూర్ నియోజకవర్గంలోని శివ్వంపేట మండలంలో చాలా వరకు తండాలున్నాయి. ఎస్టీ ఎస్డీఎఫ్ ద్వారా ఇక్కడ తారు రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధుల మంజూరయ్యాయి. గతంలో రూ.55కోట్లతో అన్ని తండాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం తారు రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని 30తండాలకు తారు రోడ్ల నిర్మాణంకు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు రూ.69.41కోట్లు మంజూరయ్యాయి. వీటితో శివ్వంపేట మండలం చండి-బిజిలీపూర్ మాల్యా తండా, చండి-రూప్‌సింగ్ తండా, చండి-గంగాయపల్లి తండా, పెద్దగొట్టిముక్క వెంక్యా తండా, ఎస్ఎన్‌టి రోడ్డు-సామ్యా తండా, గడ్డమీది తండా-మాసాయిపేట మార్గాల్లో తారు రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు నవాబుపేట-రాంలా తండాకు 1-9 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.41కోట్లతో తారు రోడ్డు వేస్తున్నారు. గూడూరు-చెన్నాపూర్ సామ్యాతండా మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.35కోట్లు, సికింద్లాపూర్ పిట్టలవాడకు 1-9కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.54కోట్లు కేటాయించారు.

**నాణ్యతగా పనులు:నాగరాజు, డీఈ, ఆర్అండ్‌బీ**

రోడ్ల నిర్మాణం పనులు ఏఈల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాల ప్రకారం జరిపిస్తున్నాం. శివ్వంపేట మండలం మినహా మిగతా మండలాలకు గుత్తేదారులు ముందుకు రాలేదు. బిల్లులు సకాలంలో రావడం లేదనే కారణంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

# రుణ పరిమితి పెంపు... అన్నదాతకు ఇంపు

సూర్యాపేట : కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని 1998లో అన్నదాతల అవసరాల నిమిత్తం అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్డు ద్వారా వ్యవసాయ రంగంతోపాటు మత్స్య, పశుసంవర్ధక రంగాల వారు స్వల్పకాలిక రుణాన్ని పొందేలా చర్యలు తీసుకుంది. ఇదివరకు రూ.3 లక్షల రుణపరిమితి ఉండగా తాజాగా బడ్జెట్లో రూ.5 లక్షలకు పెంచింది. ఈ కార్డులతో వ్యవసాయం సహా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలు, కూలీల ఖర్చు, పంట కోత ఖర్చులు వంటి అవసరాల కోసం రుణం తీసుకునే సదుపాయం కల్పించింది. వీటితో బీమా సదుపాయం కూడా ఉంది.

**1.25 లక్షల మంది మాత్రమే వినియోగం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,08,810 మంది రైతులు ఉన్నారు. వీరిలో 1.25 లక్షల మంది మాత్రమే ఈ క్రెడిట్ కార్డు ద్వారా లబ్ధి పొందుతున్నారు. మిగతా రైతులు అవగాహన లేక వీటిని పొందలేకపోతున్నారు.




బ్యాంకర్లు కూడా సిబిల్ స్కోరు, ఇతర కారణాలు చూపుతూ కార్డులు ఇవ్వడం లేదు. రైతులందరికీ అవగాహన కల్పించి అర్హులైన వారికి కేసీసీలు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఎలా పొందాలంటే?**కిసాన్ క్రెడిట్ కార్డులకు ఆన్‌లైన్ లేదా నేరుగా అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. నేరుగా అయితే రైతులు తమ ఖాతా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులో లభించే ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేసి ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులలో ఏదైనా ఒకదానిని జత చేసి పాస్ ఫొటో, పట్టాపుస్తకం నకలుతో దరఖాస్తు చేసుకుంటే.. పది రోజుల్లో అయిదేళ్ల కాలపరిమితితో క్రెడిట్ కార్డును మంజూరు చేస్తుంది. ఆన్‌లైన్‌లో అయితే సంబంధిత బ్యాంక్ వెబ్‌సైట్లో కిసాన్ క్రెడిట్ కార్డు ఆప్షన్‌లో అడిగిన వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

# పీఎస్‌ఆర్ సెంటర్..!

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో పీఎస్‌ఆర్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. ఈ కేంద్రం అన్ని వ్యాపారాలకు నిలయంగా మారింది. సూర్యాపేట పట్టణం ఆవిర్భావం నుంచి పీఎస్‌ఆర్ సెంటర్‌లో దొరకని వస్తువు ఉండదు. పట్టణ శివారు ప్రాంతవాసులతోపాటు, చుట్టుపక్కల వారు ఇక్కడికే వస్తుంటారు. తమకు కావాల్సిన వస్తువులను ఖరీదు చేస్తుంటారు. పీఎస్‌ఆర్ సెంటర్‌లో ముఖ్యంగా విద్యుత్తు మోటార్ల మరమ్మతుకు ప్రధాన కేంద్రంగా పేరుగాంచింది. వ్యవసాయ, నివాస గృహాలలోని మోటార్లు మరమ్మతుకు గురైతే ఇక్కడికే వస్తుంటారు. 50 నుంచి 70 మంది



మోటార్ల విక్రయ వ్యాపారులే ఉన్నారు. మిగతా మందులు, కిరాణా, హోటల్, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తుంటారు.

**రోజూ రూ.30 లక్షల వ్యాపారం**

సూర్యాపేటలోని పీఎస్‌ఆర్ సెంటర్‌లో రోజుకు రూ.30 లక్షల వ్యాపారం నిర్వహిస్తుంటారు. మోటారు, దుకాణాలు, మందులు, ఇతరాల విక్రయాలతో ఆదాయం వస్తోంది. ఇక్కడ దుకాణాల్లో వందల మంది ఉపాధి పొందుతున్నారు. మోటారు మెకానిక్ పనులు నేర్చుకుంటున్నారు. ఔషధ దుకాణాలు, ఇతర వాటిల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రత్యేక మోటారు షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇక్కడికి సూర్యాపేట నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల వారు వచ్చి మరమ్మతు చేయించుకొని వెళ్తుంటారు. ఇక్కడ రోజూ వ్యాపార నిర్వహణతో సందడిగా ఉంటుంది.

# చెర్వుగట్టు వెలిగేట్టు

నార్కట్‌పల్లి : పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి గుహాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, నల్గొండలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం 1,80,000 లడ్డూలను, పులిహోర ప్రసాదాలను తయారు చేస్తున్నారు. వసతులు, పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అందమైన చిత్రాలు, తాత్కాలి క మరుగుదొడ్లు 40 వరకు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం నిత్యం పనులను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బారికేడ్లు, సుమారు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గుట్టపైకి వాహనాల అనుమతి లేకపోవడంతో గుట్ట కింద మొదటి మార్గం హైదరాబాద్, సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలను నార్కట్‌పల్లి మీదుగా నంది విగ్రహాల స్వాగత ద్వార సమీప ప్రాంతాల్లో.. నల్గొండ నుంచి వచ్చే వాహనాలను యల్లారెడ్డిగూడెంలోని స్వాగత ద్వారం పరిసర పాంతాల్లో పార్కింగ్ స్థలాలను కేటాయించారు. సుమారు 50 ఎకరాల్లో మూడు పార్కింగ్ స్థలాలను ఏర్పాట్లు చేస్తున్నారు.

**ప్రతి 10 నిమిషాలకో బస్సు**

చెర్వుగట్టులో ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఉచిత ప్రయాణం ఉంటుందని.. నల్గొండ రీజియన్లలో నిత్యం నడుపుతున్న 125 బస్సులతో పాటు అదనంగా 15 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. శైవాలయాల్లో శివరాత్రి రోజున కల్యాణం నిర్వహిస్తుంటారు. చెర్వుగట్టు దేవాలయంలో మాత్రం ఏటా మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) ఘడియల్లో కల్యాణం నిర్వహించడం విశేషం.

ఏర్పాట్లు పూర్తి - సిరికొండ నవీన్‌కుమార్, ఈవో గత బ్రహ్మోత్సవాల లోపాలను సరిదిద్దుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. పారిశుద్ధ్యం, మంచి నీరు, మరుగుదొడ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం.

# నిధుల వేటలో హెచ్ఎండీఏ

హైదరాబాద్ : కొత్త ఏడాదిలో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులను పరుగులు పెట్టించాలని భావిస్తున్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) నిధుల వేట కొనసాగిస్తోంది. ఇప్పటికే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కొన్నింటికి భూసేకరణకు కూడా అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు నిధుల కోసం పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ విదేశీ బ్యాంకులతో పాటు దేశీయంగా హడ్కో, ఇతర ఫైనాన్స్ సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

జిల్లాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సజావుగా రాకపోకలు సాగించేందుకు ప్యారడైజ్ జంక్షన్ నుంచి రెండు హెలివేటెడ్ కారిడార్లను నిర్మించేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల కిందట శంకుస్థాపన చేశారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి రక్షణ శాఖ భూములు కీలకంగా మారాయి. అనేక సార్లు దిల్లీ వెళ్లి ఈ భూములను సేకరించేందుకు రక్షణ శాఖను ఒప్పించారు. ఇందులో భాగంగా ఇప్పటికే భూములను అప్పగించేందుకు రక్షణ శాఖ సైతం ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ నడుస్తోంది. జనవరిలో రక్షణ భూములు హెచ్ఎండీఏ చేతికి రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు భూసేకరణతో కలిపి రూ.5 వేల కోట్లపైనే అవసరం. వీటితోపాటు మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా మీరాలం చెరువుపై ఆరు లైన్లతో ఐకాన్ వంతెన, దానిని చుట్టూ పరిసరాల్లో పచ్చదనం, మౌలిక వసతుల




అభివృద్ధికి రూ.250 కోట్లు అవసరం ఉంది. ఈ వంతెనతో పాతబస్తీ రూపురేఖలు మారనున్నాయి. త్వరలో నిర్మాణ పనులు మొదలు కానున్న ఆర్ఆర్ఆర్ నగరంతో అన్ని జిల్లాలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఫోర్త్‌సిటీ నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు ఈ కొత్తనగరంతో కలిపేందుకు 100 మీటర్ల వెడల్పుతో 41 కిలోమీటర్ల మేరకు గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణానికి హెచ్ఎండీఏ సమాయత్తమవుతోంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి పలు సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. కొత్త ఏడాదిలో నిధుల సమీకరణ ఒక కొలిక్కి వచ్చి అన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయని భావిస్తున్నారు. మార్చి నుంచి అన్ని ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుందని చెబుతున్నారు. అవసరమయ్యే నిధులు ఇలా (భూసేకరణతో కలిపి రూ.కోట్లల్లోనే)ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఓఆర్ఆర్ శామీర్‌పేట జంక్షన్ వరకు హెలివేటెడ్ కారిడార్ - రూ.3,619


ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్-44 డెయిరీఫాం వరకు హెలివేటెడ్ కారిడార్ - రూ.1,844 మీరాలం ట్యాంకుపై 6 లేన్ల ఐకాన్ వంతెన నిర్మాణం - రూ.250 కోట్లుమీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు - రూ.2,710

ఓఆర్ఆర్ రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు - రూ.2,112

# ఇంటర్ విద్య.. మరింత మెరుగ్గా..!

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు (1969) నుంచి పౌరశాస్త్రం (సివిక్స్) సబ్జెక్టును బోధించేందుకు శాశ్వాత అధ్యాపకులను నియమించలేదు. హిస్టరీ (చరిత్ర) బోధిస్తున్న అధ్యాపకులకే ఈ బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక కళాశాలల్లో నెలకొంది. బోధన సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నిసార్లు సర్కారు దృష్టికి తీసుకెళ్లినా నిరాశే ఎదురైంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉభయ జిల్లాల్లో అధ్యాపకుల కొరత తీరటంతో పాటు విద్యార్థులకు బోధన మెరుగుపడనుంది.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంటర్ ఉచిత విద్యనందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరింత బలోపేతం కానున్నాయి. కొన్నేళ్లుగా శాశ్వత అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవటంతో కళాశాలల్లో బోధనపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావటం లేదు. ఈ సమస్య పరిష్కారం దిశగా



ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారి సర్కారు కళాశాలల్లో 1,239 మంది అధ్యాపకులు విధుల్లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియను ఫిబ్రవరిలోపే పూర్తిచేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఖమ్మం జిల్లాలోని 21, భద్రాద్రి జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 110 శాశ్వత అధ్యాపకుల పోస్టులు భర్తీకానున్నాయి.

**చదువులపై తీవ్ర ప్రభావం**

అధ్యాపకుల కొరత వల్ల విద్యార్థుల చదువులతో పాటు సమాజంపైనా తీవ్రమైన ప్రభావం కనిపిస్తోంది. సరైన బోధన, అభ్యాసం లేకుండా విద్యార్థులు చదువుల్లో రాణించలేకపోతున్నారు. మార్గదర్శకత్వం లోపించటంతో గందరగోళానికి గురవుతున్నారు. తక్కువ మార్కుల కారణంగా భవిష్యత్తుపై నమ్మకం కోల్పోతున్నారు. అభద్రతాభావంతో కొందరు మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. తక్కువ విద్యా నైపుణ్యాలు ఉన్నత విద్యకు దారితీయవు. సమాజంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలు పెరుగుతున్నాయి.

**భవిష్యత్తును నిర్దేశించే దశ**

విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకమైంది. నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకునేది ఈ దశలోనే. ఇక్కడే విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించి స్పష్టమైన అవగాహనకు వస్తారు. ఇంటర్ విద్య ఉన్నత విద్యాకోర్సులకు(ఇంజినీరింగ్, వైద్యం, బిజినెస్ మేనేజ్‌మెంట్ తదితరాలు) బలమైన పునాది. ఆయా కోర్సులను అభ్యసించేందుకు, ప్రవేశాలు పొందేందుకు ఇంటర్ విద్య విషయ పరిజ్ఞానాన్ని అందిస్తుంది. నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు పునాది ఈ దశలోనే పడుతుంది.

# కేవీకే శిక్షణ.. ఉపాధి నిచ్చేన



జమ్మికుంట : మారుతున్న జీనవ శైలిలో భాగంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చాయి. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తున్నారు. చిరు ధాన్యాల ఆహారాన్ని తీసుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరు ధాన్యాలు, పండ్లు, కూరగాయలతో చేసుకునే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణ ఇస్తోంది. 15 నెలలుగా 120 మంది మహిళలు, యువతులకు ఇచ్చిన శిక్షణ మంచి ఫలితాలను ఇస్తోంది. చిరుధాన్యాల లడ్డూలు, రాగుల లడ్డూలు, జావ తయారీ, రాగులతో కేకులు, కొర్రలతో చాక్లెట్, అరిక అట్టు, జొన్న బిస్కెట్ల తయారీ, రాగులతో దోశ, మురుకుల తయారీ, వరిగల భర్ఫీ, రాగులు జొన్నలతో ఇడ్లీ, పండ్ల జామ్‌లు, మిల్క్ షేక్‌లు, మల్టీగ్రేయిన్ జావా, రాగుల పిండి, మొలకల గోధుమ, గానుగ నూనె తయారీ తదితరాలపై శిక్షణ ఇచ్చి స్వయంగా తయారు చేసుకునేలా కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి తర్ఫీదు ఇచ్చారు. దీంతో 39 మంది చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలతో ఆహార ఉత్పత్తులను తయారీ చేసి విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.

**హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో విక్రయం**

కేవీకేలో తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకున్నా. కేవీకే డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగే సదస్సుల సందర్భంగా హైదరాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. అక్కడికి వెళ్లి నేను తయారు చేస్తున్న ఉత్పత్తులను విక్రయిస్తున్నాను. గానుగ పద్ధతిలో నూనె తయారు చేసి విక్రయిస్తున్నా. రూ.పదిహేను వేలు మిగులుతున్నాయి. ఆకినపల్లి పద్మ, శాయంపేట, జమ్మికుంట

**అందరికీ ఆసక్తి**

నేను లడ్డూలు, బిస్కెట్లు, కేకులు, పండ్ల రసాలు తయారు చేసి విక్రయిస్తున్నా. మా కుమార్తె నిఖిల ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణలో భాగంగా ప్యాకింగ్, లేబుల్స్‌పై మెలకువలు నేర్చుకుంది. పోషక పదార్థాల ఆర్డర్‌ను బట్టి ఉత్పత్తులు తయారు చేస్తూ కరీంనగర్‌లో విక్రయిస్తున్నాం. ప్రస్తుతం చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగంపై అందరికీ ఆసక్తి పెరుగుతోంది.

శ్రీలత, శ్రీరాములపల్లి, ఇల్లందకుంట

**ఆర్డర్లను బట్టి తయారీ..**

నేను ఎంఏ బీఈడీ చేశాను. జమ్మికుంట కేవీకేలో పోషకాహార పదార్థాలపై ఇచ్చిన శిక్షణ ఉపాధికి భరోసా ఇచ్చింది. చిరుధాన్యాలతో లడ్డూలు, ఇడ్లీ, దోశ, రొట్టెల తయారీ, బిస్కెట్లు, కేకుల తయారీ, పండ్ల నిల్వ రసాలు తయారు చేసి విక్రయిస్తున్నా. వేడుకలకు ఫోన్ ద్వారా వచ్చే ఆర్డర్లను బట్టి ఇంట్లోనే తయారు చేసి పంపిస్తా. నెలకు ఖర్చులు పోను రూ.20 వేల వరకు వస్తున్నాయి. సౌజన్య, నర్సింగాపూర్, వీణవంక

**జిల్లా అధికారుల నుంచి లైసెన్స్‌లు**

కేవీకేలో ఇప్పటికే 120 మంది మహిళలు, యువతులకు శిక్షణ ఇచ్చాం. 39 మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. అధికారుల నుంచి కేంద్రంలో శిక్షణ పొందిన 13 మంది ఫుడ్ తయారీకి సంబంధించిన లైసెన్స్‌లు పొందారు. ఎ.ప్రశాంతి, శాస్త్రవేత్త, గృహవిజ్ఞాన విభాగం కృషి విజ్ఞాన కేంద్రం

# ఆధ్యాత్మిక క్షేత్రం.. తాగునీరు గగనం!




ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహస్వామి కొలువుదీరిన ధర్మపురి పట్టణం.. తాగునీటికి అల్లాడుతోంది. గోదావరి పక్కనే ఉన్నా.. తాగునీటికి మాత్రం ఏటా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇది వేసవిలో అనుకుంటే సాధారణమే అయినా.. శీతాకాలంలోనూ అదే పరిస్థితి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీరు జిల్లాలోని దబ్బా గ్రామం నుంచి ధర్మపురికి సరఫరా కావడం లేదు. మరోవైపు కమలాపూర్ బోలిచెరువు వద్దగల పైపులైను ఇటీవల పగిలిపోయింది. దీంతో మూడు రోజులుగా పట్టణంలో నీటి సమస్య వేధిస్తుంది. పురపాలక అధికారులు ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

**పైపులైను విస్తరణ ఇంకెప్పుడు?**

పట్టణంలోని కమలాపూర్, నక్కలపేట ఇందిరమ్మ కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైను విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ రెండు కాలనీల్లో తాగు నీటి సమస్యలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో సుమారుగా రెండు వేలమంది నివసిస్తుండగా.. తాగునీటికి సమీపంలోని బోర్ల పైనే ఆధారపడుతున్నారు. తాగునీటి పైపులైన్ పనులు పూర్తి కావాల్సి ఉంది. వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**రైతుల ఖాతాలకు రుణమాఫీ నిధులు**

జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితమే నాలుగో విడత పంట రుణమాఫీ ప్రక్రియను ప్రకటించగా రెండు రోజులుగా రైతుల పంటరుణ ఖాతాలకు నిధులను విడుదల చేస్తున్నారు. ఈ విడతలో జిల్లాలో 8,414 మంది ఉండగా వీరికి ప్రస్తుతం రూ.76.47 కోట్ల నిధులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 తేదీల్లో తీసుకున్న పంటరుణాలు, రెన్యూవల్స్ రుణాలను పరిగణలోకి తీసుకుని పంటరుణాల మాఫీ ప్రక్రియ చేపట్టింది. ఈ కటాఫ్ తేదీ ప్రకారం జగిత్యాల జిల్లాలో మొత్తం 1,38,142 మంది రైతులుండగా నాలుగు విడతల్లో కలిపి ఇప్పటివరకు 80,515 మందికి రూ.721.74 కోట్ల నిధులను విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ నాలుగు విడతల్లోనూ వివిధ కారణాలతో జిల్లాలో నిధులందని రైతులు 5 వేల మంది వరకు ఉన్నట్లు అధికారుల అంచనాగా ఉంది.

**పూర్తిస్థాయిలో చేయరూ..**

పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని రూ.2 లక్షలకన్నా అధికంగా రుణమున్న అన్నదాతలు కోరుతున్నారు. జిల్లాలో రూ.2 లక్షలకన్నా ఎక్కువ రుణమున్నవారు 53,627 మంది ఉన్నారు. వీరిలో వ్యక్తిగతంగా లేదా రేషన్‌కార్డును కుటుంబంగా లెక్కించి ఇప్పటివరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. కుటుంబాన్ని ఒక యూనిట్గా లెక్కించి ఎందరికి, ఎంత రుణమున్నా రూ.2 లక్షలకన్నా అదనంగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలను విడుదల చేస్తామని తొలుత ప్రభుత్వం ప్రకటించింది కానీ.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ పూర్తయ్యిందని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం పేర్కొనటంతో అంతకుపైన ఉన్న తమ పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంలో ఒకరికి రూ.లక్షన్నర, మరొకరికి రూ.లక్ష.. ఇలా చాలా కుటుంబాల్లో వ్యక్తిగతంగా రూ.2 లక్షలకన్నా తక్కువగానే రుణమున్నా కుటుంబాన్ని కలిపి లెక్కించటంతో రూ.2 లక్షలను దాటింది. ఈ నేపథ్యంలో కనీసం ఒకరినయినా పరిగణలోకి తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

లబ్ధి పొందిన రైతుల సంఖ్య

మొదటి విడత : 49,050

రెండో దఫా : 15,466

మూడో విడత : 7,585

నాలుగో దఫా : 8,414

# జీజీ కళాశాల అభివృద్ధికి సహకరించండి



నిజామాబాద్ : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు, దాతలు ముందుకు రావాలని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పూర్వవిద్యార్థుల సంఘం సమన్వయకర్త దండుస్వామితో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో న్యాక్ గుర్తింపు కోసం సన్నద్ధమవుతున్నామని తెలిపారు. ఇందుకోసం కళాశాలలో మౌలిక వసతుల కల్పన, అంతర్గత రోడ్లు, విద్యుద్దీపాల ఏర్పాటు కోసం సహకరించాలన్నారు. ఇప్పటి వరకు 1975-78, 1981 తదితర బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు రెండు పార్కింగ్ షెడ్లు, వివిధ విభాగాల్లో ప్రతిభచాటే విద్యార్థులకు పది బంగారు పతకాలు ప్రదానం చేసేందుకు నిధులు సమకూర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వ్యక్తిగతంగా రూ.1.50 లక్షలు, న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి చెరో రూ.25 వేలు, విశ్రాంత అధ్యాపకులు, ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులు సైతం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఉపకులపతులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల రాష్ట్ర సారథులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు.

# ఇంకెన్నాళ్లు.. ఈ కష్టాలు?

ఖమ్మం : సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితులు పరిహారం కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో సుమారు 960 ఎకరాలు, ఖమ్మం జిల్లాలోని నాలుగు ప్యాకేజీల్లో రైతులకు పరిహారం అందని ద్రాక్షగానే మారింది. భూసేకరణ సమయంలో నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారమందిస్తామని ప్రకటించిన అధికారులు.. ఆతర్వాత అమాంతం తగ్గించి చెల్లిస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఖమ్మం జిల్లాలో పరిహారం లెక్కలు తేలటం లేదు.

**రైతుల నిరీక్షణ..**

ఉభయ జిల్లాల్లోని సుమారు 9లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రభుత్వం 2017లో సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అశ్వాపురం మండలం భీమునిగుండం కొత్తూరు వద్ద 2018లో పనులు మొదలయ్యాయి. 16 (భద్రాద్రి జిల్లాలో 1-12, ఖమ్మం జిల్లాలో 13-16) ప్యాకేజీలుగా పనులను విభజించారు. రెండేళ్లలో పనులు పూర్తవ్వాలని లక్ష్యం నిర్దేశించుకున్నా ఇప్పటికీ కొనసా..గుతూనే ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 6,322.17 ఎకరాల భూమిని సేకరించగా 5,363.14 ఎకరాలకు రూ.381.82కోట్ల పరిహారం చెల్లించారు. 959.03 ఎకరాలకు రూ.75.08కోట్ల పరిహారం నిర్వాసితులకు అందాల్సి ఉంది. అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

**పనులు సాగుతున్నా..**

ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తీసుకొచ్చే లక్ష్యంతో సత్తుపల్లి ట్రంక్, పాలేరు ట్రంక్, రాజీవ్ అనుసంధాన కాల్వ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గోదావరి జలాలతో వైరా జలాశయాన్ని నింపి తద్వారా



వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని 1.20లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేలా రాజీవ్ అనుసంధాన కాల్వకు రూపకల్పన చేసింది. రూ.100కోట్లోతో 8.60కి.మీ. కాల్వ నిర్మించాలని నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు, భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు మండలాలకు చెందిన 300 మంది రైతుల నుంచి 193 ఎకరాలను అధికారులు సేకరించారు. పరిహారం ఖరారయ్యాక భూసేకరణ జరగటం ఆనవాయితీ. అయినా ఇక్కడ మాత్రం రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ముందే స్థలాలిచ్చారు. ఎకరాకు రూ.40లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతుండగా రూ.20లక్షలు చెల్లిస్తామని అధికారులు ఇటీవల ప్రకటించారు. దీనిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సత్తుపల్లి ట్రంక్ పరిధిలో 1.27 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా 116 కి.మీ. పొడవు కాల్వ నిర్మాణం సాగుతోంది. పాలేరు ట్రంక్ పరిధిలో 94వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 79కి.మీ. పొడవు కాల్వపనులు జం

**అధికారులు ఏమంటున్నారంటే..**

నిర్వాసిత రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే వారి ఖాతాల్లో పరిహారం సొమ్ము జమవుతుందని చెబుతున్నారు.

స్రీతారామ పాజెక్టు అనుసంధాన కాల్వ నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చాం. దీనిలో అరెకరం ప్రభుత్వ భూమి ఉందని అధికారులు తెలిపారు. పట్టా భూమి ఎకరాకు రూ.20లక్షల పరిహారమిస్తామని ఇటీవల ప్రకటించారు. ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న గిరిజనేతరులకు ఎకరాకు రూ.5లక్షలే ఇస్తామని తెలిపారు. అన్నిరకాల భూములకు ఒకేరకంగా పరిహారం చెల్లించాలి.

నరసింహారావు, వినోబానగర్, జూలూరుపాడు మండలం

మాకు 3.01ఎకరాల భూమి ఉండగా 40ఏళ్లుగా పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాం. గతేడాది సీతారామ అనుసంధాన కాల్వ నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చాం. మిగిలిన ఎకరం మధ్యలో కాల్వ తవ్వారు. ఈ భూమిని సాగు చేసుకోవటం కష్టంగా మారింది. పరిహారం అంశంపై నెలకో సమావేశం నిర్వహిస్తున్నా ప్రయోజనం లేదు. న్యాయమైన పరిహారం అందించాలి.

భాస్కర్‌రావు, ఏన్కూరు

# ఆ వాహనాలు మాకూ కావాలి..

ఖమ్మం : గర్భిణులు, బాలింతలతోపాటు ఏడాదిలోపు చిన్నారులను ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వాసుపత్రులకు తీసుకెళ్లేందుకు 102 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో అమ్మఒడి పథకంలో భాగంగా 2018లో ఈ సేవలు మొదలయ్యాయి. ధర్మాసుపత్రులకు వెళ్లేందుకు పేద వర్గాలకు వ్యయప్రయాసలను దూరం చేసిన ఈ వాహన సదుపాయం అనతికాలంలోనే ఆదరణ చూరగొంది. ఖమ్మం జిల్లాలో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు అనుబంధంగా మొత్తం పదకొండు వాహనాలున్నాయి. క్షేత్ర స్థాయిలో అవగాహన పెరగడంతో గతేడాది 38,629 మంది 102 వాహనాలను వినియోగించుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నేటికీ ఈ సదుపాయం అందుబాటులో లేదు. కొత్త వసంతంలో అయినా అవసరాలకు తగ్గట్టు వాహనాల సంఖ్య పెంచాలని జిల్లావాసులు కోరుతున్నారు.

**ఇక్కడ ఎంతో అవసరం..**

ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ మంది సేవలు పొందుతున్నట్లు గుర్తించిన పెనుబల్లి, బోనకల్లు, ముదిగొండ ప్రాంతాల్లో 102 వాహనాలు లేవు. బోనకల్లుకు మధిర, వైరా ప్రాంతాల నుంచి, ముదిగొండకు నేలకొండపల్లి, ఖమ్మం నుంచి వాహనాలు వెళ్తున్నాయి. పెనుబల్లికి కల్లూరు, సత్తుపల్లి మండల వాహనాలే ఆధారమయ్యాయి. కొన్నిసార్లు వాహనాల రాకలో జాప్యం జరుగుతూ లబ్ధిదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యయప్రయాసలతో ప్రైవేటు వాహనాల్లో సర్వజనాసుపత్రికి వస్తున్నామని గర్భిణులు చెబుతున్నారు.

**కాల్ చేస్తే సరి..**గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడి నుంచైనా 102 నంబర్‌కు కాల్ చేస్తే పరిసరాల్లో ఉన్న అంబులెన్స్ సర్వీసు వస్తుంది. అవసరార్థులను ఆస్పత్రులకు తరలిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ప్రసవ కిట్లు కూడా ఇందులో ఉన్నాయి.

ఇక్కడ ఉన్నాయి..ఖమ్మం సర్వజనాసుపత్రి, సత్తుపల్లి, మధిర, కల్లూరు, నేలకొండపల్లి, వైరా సీహెచ్‌సీలు, కామేపల్లి, ఏన్కూరు, తిరుమలాయపాలెం, మంచుకొండ, కూసుమంచి పీహెచ్‌సీల్లో..




## అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకకు ప్రధాని.. త్రివేణి సంగమంలో మోదీ పుణ్య స్నానం..!

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ సందర్భంగా బుధవారం (ఫిబ్రవరి 5) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్రివేణి సంగంలో పవిత్ర స్నానం అచరించారు. ఇక్కడ ప్రధాని మోదీ దాదాపు అరగంట పాటు స్నాన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మోదీ పర్యటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ నగరంతోపాటు కుంభమేళా దగ్గర భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్ళారు. అరైల్ ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం గంగా, యమునా, సరస్వతి త్రివేణి సంగమంలో ప్రధాని మోదీ పుణ్యస్నానం ఆచరించారు. తిరిగి బోటులో ఆ ప్రాంతం నుంచి అరైల్ ఘాట్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత అరైల్ ఘాట్ నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి తిరిగి ఢిల్లీ బయల్దేరారు. మోదీ పర్యటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ నగరంతోపాటు కుంభమేళా దగ్గర భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ముగియనుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు త్రివేణి సంగమానికి పోటెత్తారు భక్తులు. ప్రయాగ్‌రాజ్ ఘాట్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటి వరకు 38కోట్ల మంది కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది.

సామాన్యులతోపాటు అనేక మంది ప్రముఖులు కూడా ఈ కుంభమేళాకు హాజరవుతున్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ 2024 డిసెంబర్ 13న ప్రయాగ్‌రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రూ.5,500 కోట్ల విలువైన 167 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మహా కుంభమేళా ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించడం ఇదే తొలిసారి.




## ఐటీ చెల్లిస్తే ఫ్రీ రేషన్ కట్.. అనర్హుల ఏరివేత దిశగా కేంద్రం అడుగులు!

దిల్లీ: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలను ఆహార మంత్రిత్వ శాఖతో ఐటీ విభాగం పంచుకోనుంది. తద్వారా ఏరివేత ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చెల్లించని వారికి పీఎంజీకేఏవై కింద పేద కుటుంబాలకు ప్రభుత్వం ఉచిత రేషన్ అందిస్తున్న విషయం తెలిసిందే. 2024 జనవరి 1 నుంచి ఐదేళ్ల పాటు ఉచితంగా ఆహారధాన్యాలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.1.97 లక్షల కోట్లు వెచ్చించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తాజా బడ్జెట్‌లో రూ.2.03 లక్షల కోట్లను ప్రతిపాదించింది. దేశంలో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అనర్హుల ఏరివేతకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తాజాగా ఓ ఆఫీసు ఆర్డర్‌ను జారీ చేసింది. ఇందులో భాగంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (సిస్టమ్స్).. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆహారం, ప్రజా పంపిణీ విభాగం జాయింట్ సెక్రటరీతో సమాచారాన్ని పంచుకోనుంది. ఆధార్, పాన్, మదింపు సంవత్సరం వివరాలను సమర్పిస్తే.. నిర్ణీత మొత్తం కంటే ఆదాయం కలిగిన వారు ఉన్నవారి డేటాను డీజీఐటీ సిస్టమ్స్ అందిస్తుంది. అనర్హుల వివరాల గుర్తింపులో ఈ డేటా కీలకం కానుంది. ఈ గుర్తింపు పూర్తయ్యాక కేంద్రం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.




తిరుమల: హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూయేతర మత ఆచారాలు పాటించిన వారిపై చర్యలకు తితిదే సిద్ధమైంది. 1989 ఎండోమెంట్ యాక్ట్ 1060 మేరకు హిందూమత సంప్రదాయాలను అనుసరిస్తామని ప్రమాణం చేసి తితిదేలో ఉద్యోగం పొందిన కొందరు అన్యమతాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు తితిదే ఆదేశాలు జారీ చేసింది. హిందూయేతర ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీఆర్ఎస్ తీసుకునే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతేడాది నవంబరు 18న తితిదే బోర్డు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీకి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలిలో కీలక చర్చ జరగనుంది. ప్రధానంగా వైసీపీ హయాంలో ఫ్రీ హోల్డ్ చేయబడిన 22-ఏ భూముల వ్యవహారం చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. విశాఖ పంచగ్రామాల సమస్యపైనా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ భూములకు సంబంధించి ఏపీ సర్కార్ పరిష్కారం చూపించింది. అయితే స్థానికులకు ప్రత్యామ్నాయంగా అదే విలువ కలిగిన భూముల కేటాయించాలని చంద్రబాబు సర్కార్ యోచిస్తోంది. దానిపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఎస్ఐపీబీలో ఆమోదించిన రూ.44.776 కోట్ల విలువైన 15 ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదముద్ర పడే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,580 మంది యువత ఉద్యోగ అవకాశాలు పొందనున్నారు. ఈ నెలాఖరులో జరగనున్న అసెంబ్లీ సమావేశాలపై క్యాబినెట్ మీటింగ్ అనంతరం సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించనున్నారు. ఏపీలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపైనా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యామండలికి ప్రత్యేక కమిషనరేట్ ఏర్పాటుపైనా క్యాబినెట్‌లో మంత్రులు చర్చించే అవకాశం కనిపిస్తోంది. క్యాబినెట్ సమావేశాల్లో పలు అంశాలకు మంత్రిమండలి ఆమోదముద్ర పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## పవన్ వైరల్ జ్వరంతో బాధపడుతున్నారు
### డిప్యూటీ సీఎం కార్యాలయం

అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైరల్ జ్వరంతో బాధపడుతున్నారని డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పవన్‌ను స్పాండిలైటిస్ కూడా బాధపెడుతోందని, వైద్యుల సూచనతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గురువారం జరిగే కేబినెట్ భేటీకి పవన్ హాజరుకాకపోవచ్చని వెల్లడించారు.

## అప్పుల్లో మునిగిన ఏపీకి కేంద్రం ఆక్సిజన్.. రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీలో లోకేశ




దిల్లీ: ఏపీ మంత్రి నారా లోకేశ్ రెండో రోజు దిల్లీ పర్యటన కొనసాగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను రాజ్‌నాథ్ సింగ్‌కు లోకేశ్ వివరించారు. ఏపీలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. రక్షణ రంగ పరికరాల యూనిట్లు రాష్ట్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఏపీని తిరిగి అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నట్లు వివరించారు. అమరావతి, పోలవరం పనులు సాగుతున్న తీరును లోకేశ్ వివరించారు. అప్పుల్లో మునిగిన ఏపీకి కేంద్రం ఆక్సిజన్ అందిస్తోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఏపీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు.

## వివేకా హత్య కేసు.. దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు



పులివెందుల: వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు. 2023లో దస్తగిరిని ఇబ్బంది పెట్టిన నలుగురిపై పులివెందుల పోలీసులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. కేసు నమోదైన వారిలో వివేకా హత్య కేసు నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి, గతంలో జమ్మలమడుగు డీఎస్పీగా పనిచేసిన నాగరాజు, ఎర్రగుంట్ల సీఐగా పనిచేసిన ఈశ్వరయ్య, కడప జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రకాశ్ ఉన్నారు. 2023 అక్టోబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు కడప జైలులో దస్తగిరి రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

ఈక్రమంలో వివేకా కేసులో వైకాపా నేతలకు మద్దతుగా మాట్లాడాలని డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్య బెదిరించినట్లు దస్తగిరి ఫిర్యాదు చేశారు. మరోవైపు 2023 నవంబరులో కడప జైలుకు వచ్చి సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించినట్లు దస్తగిరి ఫిర్యాదు చేశారు. రామ్ సింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తానని చెప్పినట్లు అందులో పేర్కొన్నారు. వీరితో పాటు జైలులో సూపరింటెండెంట్ ప్రకాశ్ తనను ఇబ్బంది పెట్టారని దస్తగిరి ఫిర్యాదులో వివరించారు.




అపఖ్యాతిలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆయన్ను చూసి పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలతో మంత్రులు నిమ్మల, కందుల దుర్గేశ్ సమావేశం జరిగింది.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నిమ్మల మాట్లాడారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు కూటమి నేతలు సమష్టిగా కృషి చేయాలన్నారు. "జగన్ మళ్లీ అధికారంలోకి రారనే భరోసా కల్పిస్తేనే పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తామని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో చెత్త సీఎం అంటే ఆయనే. జగన్ పెండింగ్‌లో పెట్టిన రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టడంతో పాటు నిర్వాసితులను రూ.1000 కోట్ల పరిహారం అందించాం. రైతులకు జగన్ ఎగ్గొట్టిన రూ.1640 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది.

20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది" అని రామానాయుడు అన్నారు.

## భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాల వ్యవహారం.. కమిటీ ఏర్పాటుకు హైకోర్టు ఆదేశం

అమరావతి: విశాఖలోని భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాల వ్యవహారంలో జిల్లా కలెక్టర్, విశాఖ మున్సిపల్ కమిషనర్, సీఆర్‌జెడ్ జోనల్ అధికారితో కమిటీ ఏర్పాటు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. భీమిలి బీచ్ వద్ద నిర్మాణాలను కమిటీ పరిశీలించి.. నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన న్యాయస్థానం.. తదుపరి విచారణ నాటికి నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. భీమిలి బీచ్ వద్ద నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.




## మిర్చి బోర్డు ఏర్పాటు చేయండి: ప్రత్తిపాటి డిమాండ్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 05: మిర్చి రైతుల పరిస్థితి దిక్కుతోచని స్థితిలో ఉందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. పతనమవుతోన్న ధరలతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రధాన వాణిజ్య పంట సాగుదారులను రక్షించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని ఆయన స్పష్టం చేశారు. బుధవారం చిలకలూరిపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పొగాకు బోర్డు మాదిరిగా.. మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా మిర్చి రైతుల దశ మారేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన పేర్కొన్నారు. వ్యాపారుల మాయాజాలం.. మార్కెట్ హెచ్చుతగ్గుల నియంత్రణఖు ప్రత్యేక చట్టాల ద్వారా చెక్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మిర్చి ధరల పతనంపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. మిర్చి రైతుల్ని వెంటనే ఆదుకోవాలంటూ ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని జిల్లాల్లో మాత్రమే మిర్చి పంటను రైతులు పండిస్తున్నారు. అయితే మిర్చి పంటను విక్రయించే క్రమంలో రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు. ఒక్కొక్కసారి మార్కెట్‌లో ధరల హెచ్చ తగ్గుల కారణంగా.. పండించిన పంటకు అయిన ఖర్చుకు తగినట్లుగా నగదు చేతికందడం లేదు. దీంతో మిరప వాణిజ్య పంటే అయినా.. దానికి తగినట్లుగా నగదు చేతికందడం లేదు. దాంతో మిర్చి రైతులు ఢీలా పడిపోతున్నారు. అలాంటి వేళ.. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుపై విధంగా స్పందించారు. మరోవైపు.. గుంటూరులో పొగాకు బోర్డును గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం విధితమే. అలాగా ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి బోర్డును సైతం ఏర్పాటు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఆడ - మగ ఎవరైనా సమానంగా పారితోషికాలిస్తాను: సమంత

సినీపరిశ్రమలో పారితోషికాల పరంగా, సౌకర్యాల పరంగా, గౌరవం పరంగా పురుషాధిక్యత గురించి చాలా కాలంగా చర్చ సాగుతోంది. మేల్ డామినేటెడ్ ప్రపంచంలో స్త్రీలకు తగిన గౌరవం దక్కడం లేదని, అవమానాలు ఎదురవుతున్నాయని, పారితోషికాల్లో తక్కువ చేస్తున్నారని చాలా మంది కథానాయికలు బహిరంగంగా వాపోయారు. హీరోలకు సమానంతా తమకు కూడా పారితోషికాలివ్వాలని నటీమణులు డిమాండ్ చేస్తున్నారు. ఆడ మగ వ్యత్యాసాలు.. భత్యంలో హెచ్చుతగ్గులు వంటివి పూర్తిగా సమసిపోవాలని చాలా మంది ఆకాంక్షించారు. ఇటీవల హేమ కమిటీ (మాలీవుడ్) నివేదికలోను ఇలాంటి విషయాల ప్రస్థావన ఉంది. పారితోషికాల్లో వ్యత్యాసం గురించి అగ్ర కథానాయిక సమంత రూత్ ప్రభు కూడా గతంలో ప్రస్థావించారు. పారితోషికంలో మేల్ డామినేషన్ ని ప్రశ్నించారు. తాజాగా మరోసారి పారితోషికాల్లో ఆడా మగా వ్యత్యాసం గురించి అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఇండస్ట్రీలో నాతో పాటు నటించిన సహచరులతో పోలిస్తే నాకు తక్కువ పారితోషికం ఇచ్చారని సమంత అన్నారు. నాకు అనుభవం చాలా ఉన్నా కానీ తక్కువ భత్యం చెల్లించారు. ఇది నా నిర్మాణ సంస్థలో జరగకూడదు అనుకున్నాను. నేను ఆడా మగా సమానత్వం చూస్తాను. మా నిర్మాణ సంస్థలో



అందరికి ఒకే రకంగా చెల్లింపులు ఉంటాయి. నేను అనుభవించింది ఇంకో స్త్రీ అనుభవించకూడదు. మా సంస్థలో ఆడా మగా సమానంగా ఉండేలా చూస్తాను అని తెలిపింది. అయితే సమంత వ్యాఖ్యలపై నెటిజనుల్లో డిబేట్ స్టార్టయింది. పారితోషికాలు అనేవి స్టార్ల మార్కెట్ రేంజును బట్టి ఉంటుంది. హీరోని చూసి మాత్రమే టికెట్లు తెగుతున్నాయి. ఒకవేళ హీరోయిన్ ని చూసి లేదా ఐటమ్ భామను చూసి టికెట్లు తెగితే దానికి తగ్గట్టుగా వారు కూడా పారితోషికాలు అందుకుంటున్నారు కదా? అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈరోజుల్లో ఆలియా, కరీనా కపూర్, దీపిక పదుకొనే లాంటి కథానాయికలు మేల్ స్టార్లకు సమానంగా పారితోషికాలు తీసుకుంటున్నారు. 20 కోట్ల రేంజులో పారితోషికాలు అందుకుంటున్న హీరోయిన్‌లు ఉన్నారు. కేవలం 5 నిమిషాల ఐటమ్ నంబర్ కోసం హీరోయిన్లకు 3 కోట్ల పారితోషికాలు ఇవ్వడం ఆషామాషీ కాదు కదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇది తక్కువ చేసి చూడటం కాదు కదా? అని కొందరు నిలదీస్తున్నారు. బిజినెస్ ఎవరు తేగలరో వాళ్లే ఇక్కడ కింగ్! అని గుర్తు చేస్తున్నారు. అలాగే తన నిర్మాణ సంస్థలో మహిళల భద్రత తన బాధ్యత అని సమంత అన్నారు. ఇలాంటి మంచి విషయాలు మార్పులు అవసరమని సమర్థించారు. పరిశ్రమ అంటే ఇల్లు. ఆ ఇంటిని శుభ్రం చేసే బాధ్యత సమంతకు ఉందని అన్నారు.

## ఇంతకీ నిధి పోస్ట్ ఏ సినిమా గురించి?

సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చిన నిధి అగర్వాల్ ఆ తర్వాత అఖిల్ తో మిస్టర్ మజ్ను, ఎనర్జిటిక్ స్టార్ రామ్ తో కలిసి ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో మంచి సక్సెస్‌లు అందుకుంది. తర్వాత హీరో సినిమాలో నటించిన నిధికి పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. ఎప్పుడైతే పవన్ సినిమాలో ఛాన్స్ అందుకుందో అప్పటినుంచి నిధి నుంచి ఇప్పటివరకు మరో సినిమా వచ్చింది లేదు. హరిహర వీరమల్లులో పవన్ కు ప్రేయసిగా నిధి కనిపించనుందట. వీరమల్లు సినిమాలో యువరాణిగా ఉన్నప్పుడు యుద్ధం కూడా చేయాల్సి వచ్చిందని, ఆ పాత్ర కోసం చాలా బరువుండే చీరలు, నగలు ధరించాల్సి వచ్చేదని, షూట్ బ్రేక్ లో రెస్ట్ తీసుకోవాలన్నా వాటి వల్ల ఇబ్బందిగా ఉండేదని, వీరమల్లు కథ చాలా గొప్పగా ఉండనుందని నిధి వెల్లడించింది. పవన్ సరసన క్రేజీ ఛాన్స్ కొట్టేసిన నిధికి ఆ సినిమా రిలీజవక ముందే ప్రభాస్ సరసన రాజా సాబ్ సినిమాలో మరో ఛాన్స్ అందుకుంది. మారుతి



దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న హార్రర్ కామెడీలో నిధి అవకాశమందుకుంది. రాజా సాబ్ లో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, ఈ సినిమా తర్వాత ఆడియన్స్ తనను చూసే విధానం మారిపోతుందని చాలా నమ్మకంగా చెప్తుంది నిధి. ఇదిలా ఉంటే నిధి అగర్వాల్ రీసెంట్ గా ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. హలో ట్విట్టర్ ఫ్యామిలీ. గత కొద్దిరోజులుగా సాంగ్ రాబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. కానీ అవన్నీ రూమర్లేనని, వాటిని నమ్మొద్దని, ప్రొడక్షన్ హౌస్ నుంచి అప్డేట్ వచ్చే వరకు ఇలాంటి వాటిని నమ్మొద్దని, ముందు మంచి రోజులు రానున్నాయని నిధి పోస్ట్ చేసింది. నిధి ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్న నేపథ్యంలో ఆ రెండింటిలో నిధి పోస్ట్ చేసింది ఏ సినిమా గురించని నెటిజన్లు డీకోడ్ చేయడం మొదలుపెట్టారు. రీసెంట్ గా రాజా సాబ్ ఫస్ట్ సింగిల్ గురించి కొన్ని వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో నిధి వాటి గురించే ఎక్స్‌లో పోస్ట్ చేసి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే నిధి సినిమాల్లోకి రాకముందు అవకాశాల కోసం రెండేళ్ల పాటూ ఫోటోలు పట్టుకుని సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగినట్టు రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.




# లైలా సెన్సార్ టెన్షన్.. ఏమవుతుందో..




టాలీవుడ్‌లో ఇటీవల A సర్టిఫికెట్ సినిమాల హవా పెరిగింది. ఒకప్పుడు కుటుంబ ప్రేక్షకులు దూరంగా ఉంటారనే భయంతో దర్శకనిర్మాతలు ఈ సర్టిఫికెట్‌ను నివారించేవారు. ఫ్యామిలీ ఆడియెన్స్ సపోర్ట్ దొరికితే బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ ఏ స్థాయిలో వస్తాయో ఇటీవల సంక్రాంతికి వస్తున్నాం సినిమా నిరూపించింది. క్లీన్ U సెన్సార్ వస్తే ఒకప్పుడు నిర్మాతలు చాలా హ్యాపీగా ఫీల్ అయ్యేవారు. ఇక U/A వచ్చినా కూడా కంగారు పడిన వారు ఉన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. A సెన్సార్ లభిస్తే అసలు బజ్ దానితోనే క్రియేట్ అవుతుంది అనేలా ఓ ఇన్ డైరెక్ట్ కాన్ఫిడెన్స్ తో రిస్క్ తీసుకుంటున్నారు. బ్లడ్ బాత్ ఊచకోత రొమాంటిక్ డోస్ ఎక్కువైనా కంటెంట్ కు తగ్గట్టుగా ఉంటే ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. ఆ రూట్లో వచ్చిన యానిమల్ సినిమా రికార్డుల మోత మోగించింది, బేబీ సినిమా సెన్సేషన్‌గా మారింది. ఈ రెండు సినిమాలూ ఆ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ ప్రేక్షకులు విరగబడి వీటిని ఆదరించారు. అందుకే ప్రస్తుతం ఈ తరహా సినిమాలకు ఓ ప్రత్యేకమైన మార్కెట్ ఏర్పడింది. అయినప్పటికీ ఓ వర్గం టాలీవుడ్ స్టార్ హీరోలు ఇప్పటికీ A సర్టిఫికెట్ పై భయంతోనే ఉన్నారు. కుటుంబ ప్రేక్షకుల ఆదరణ కోల్పోతారేమో అనే అనుమానంతో తమ కథలపై సెన్సార్ ప్రభావం పడకుండా చూసుకుంటున్నారు. ఇప్పుడు అదే సమస్యను ఎదుర్కొంటోంది లైలా మూవీ యూనిట్. విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. మొదట్నుంచీ ఈ సినిమా గురించి ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. ఫస్ట్ లుక్ నుంచే ఇది ఓ డిఫరెంట్ సినిమా అనే టాక్ వచ్చింది. ఇప్పుడు సినిమా సెన్సార్ స్టేజ్‌కు వచ్చేసింది. అయితే U/A వస్తుందా? A వస్తుందా? అనే విషయంలో చిత్రబృందం టెన్షన్‌లో పడింది అని అంటున్నారు . సినిమా కంటెంట్ రీత్యా కొన్ని సీన్స్ మామూలుగా లేవని తెలుస్తోంది. అయితే కొన్ని హాస్యప్రధానమైన సన్నివేశాల్లో బోల్డ్ టచ్ ఉండటంతో సెన్సార్ బోర్డ్ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.

ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం వైరల్ అవుతోంది. విశ్వక్ సేన్ ఈ సినిమాలో చాలా సేపు లేడీ గెటప్‌లో కనిపించనున్నాడు. ఇటీవల కాలంలో టాలీవుడ్‌లో ఇలాంటి యాంగిల్‌ను పెద్దగా ఎవరూ ఎక్స్‌ప్లోర్ చేయలేదు. ఈ గెటప్‌లో ఉండే కొన్ని కామెడీ సీన్స్ కాస్త బోల్డ్ హ్యూమర్‌తో నిండివున్నట్లు సమాచారం. దీంతో సెన్సార్ బోర్డ్ ఎలా స్పందిస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది. ఎలాంటి కట్ లేకుండా ఎ సర్టిఫికెట్ వస్తే ఓకే కానీ, కొన్ని కీలకమైన సీన్స్ కట్ చేయిస్తే చిత్రబృందం ఆ నిర్ణయాన్ని ఎలా తీసుకుంటుందన్నది చూడాలి. ఇటీవలే విడుదలైన ట్రైలర్ చూసిన వారంతా సినిమాలో ఉన్న కామెడీ మేజర్ హైలైట్ అని చెబుతున్నారు. విశ్వక్ తన పాత్ర కోసం పూర్తిగా ట్రాన్స్ఫర్మేషన్ అవ్వడం, లేడీ గెటప్‌లో నవ్వులు పండించడమే కాకుండా, ప్రేక్షకులను కొత్తదనం అనిపించేలా చేయడం ప్రత్యేకంగా నిలిచే అంశాలుగా మారాయి. ఒకవేళ ఈ పాత్ర కరెక్ట్‌గా ప్రేక్షకులకు కనెక్ట్ అయితే, ఈ సినిమా విష్వక్ కెరీర్‌లో మరో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు టాలీవుడ్‌లో బోల్డ్ కాన్సెప్ట్ సినిమాలకు పెద్దగా ఆదరణ రాలేదు. కానీ మారిన ట్రెండ్ చూస్తుంటే, లైలా సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అభిప్రాయం ఉంది. విశ్వక్ కూడా ఈ సినిమాపై చాలా నమ్మకంతో ఉన్నాడు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ, ఇది తనకు ఓ కొత్త ప్రయోగమని, ప్రేక్షకులు తాను ఎప్పుడూ లేని విధంగా కొత్త యాంగిల్‌లో చూస్తారని చెప్పాడు. ఈ సినిమా విషయంలో టెన్షన్ ఎక్కడంటే, ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి సినిమాకు స్పందన ఎలా ఉంటుందనేదే. యువతకు, మల్టీప్లెక్స్ ఆడియన్స్‌కు అయితే ఈ జోనర్ కొత్త అనుభూతినిస్తుందనడంలో సందేహం లేదు. సెన్సార్ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, దాన్ని చిత్రబృందం ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి. ఇక అన్నీ అనుకున్నట్లు జరిగితే మాత్రం ఇది మరో బిగ్ హిట్ అవుతుందని అనిపిస్తోంది.

# కోలా బ్రాండ్: చిరంజీవి నుంచి అల్లు అర్జున్ వరకూ





తెలుగు చిత్రసీమలో దిగ్గజ హీరోలతో కాంట్రాక్టులు కుదుర్చుకుని ప్రచారం చేసుకోవడంలో ప్రముఖ కోలా బ్రాండ్ నైపుణ్యం గురించి చర్చ సాగుతోంది. మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ మొదలు, నేటి ట్రెండింగ్ స్టార్ అల్లు అర్జున్ వరకూ ఈ బ్రాండ్ కాంట్రాక్టులు కుదుర్చుకుని తెలుగు రాష్ట్రాల్లో భారీ బిజినెస్ చేసింది. కోట్లాది రూపాయల విలువ చేసే కాంట్రాక్టులకు సంతకాలు చేసిన స్టార్లకు ఇది మంచి ఆదాయ మార్గం కాగా, సదరు బ్రాండ్ పాపులారిటీ కూడా చుక్కల్ని తాకింది. నిజానికి మెగా కాంపౌండ్ హీరోలను కాదనుకుంటే, ఆ తర్వాత ఆప్షన్ గా సూపర్ స్టార్ హహేష్ బాబు, విజయ్ దేవరకొండతోను సదరు కోలా కంపెనీ ప్రమోషన్ చేయించుకుంది. ఏడాది రెండేళ్ల పాటు లేదా క్రేజ్ ఉన్నంత కాలం స్టార్లను కొనసాగించడం, ఆ తర్వాత కొత్త స్టార్ ని ఎంపిక చేయడం ఈ కోలా బ్రాండ్ ప్రత్యేకత. ఒక ప్రముఖ బాలీవుడ్ స్టార్ తో హిందీ బెల్ట్ లో ప్రకటన షూట్ చేయడం, ప్రముఖ తెలుగు స్టార్ తో తెలుగు రాష్ట్రాల్లో ప్రకటన రూపొందించి ప్రచారం చేయంచుకునే సదరు బ్రాండ్ కోలీవుడ్ శాండల్వుడ్ హీరోలతోను ప్రకటనలు తయారు చేసి పొరుగు భాషల్లోను వదులుతుంది. ఈ ప్రచారార్భాటంతో కోలా బ్రాండ్ ఆయా రాష్ట్రాల్లో భారీ బిజినెస్ చేస్తుంది. ప్రజల నుంచి కోట్లాది రూపాయల ఆర్జనను కళ్ల జూడటంతో కోలా బ్రాండ్ ప్రతిసారీ క్రేజ్ ఉన్న హీరోల కోసం వెతుకుతుంది. ఇప్పుడు విజయ్ దేవరకొండ స్థానంలో అల్లు అర్జున్ ని నియమించుకుంది. పుష్ప, పుష్ప 2 చిత్రాలతో అతడి పేరు వరల్డ్ వైడ్ మార్మోగుతోంది. భారతదేశంలో క్రేజీ స్టార్ హీరోలలో ఒకరిగా మారాడు బన్ని. పాన్ ఇండియా మార్కెట్ అతడి చేతికి చిక్కింది.

దీంతో క్రేజ్ ఉన్న అల్లు హీరో ఇతరులను రీప్లేస్ చేస్తున్నాడు. మెగా ఫ్యామిలీ హీరోలతోను సదరు కోలా బ్రాండ్ చాలా కాలం ప్రచార కాంట్రాక్టులను కుదుర్చుకుంది. చిరంజీవి, పవన్ కల్యాణ్ (కెరీర్ ఆరంభంలో పెప్సీకి ఒకేసారి ప్రచారం చేసారు), రామ్ చరణ్ లతో సదరు కోలాబ్రాండ్ ప్రచారం నిర్వహించింది. ఇప్పుడు అదే మెగా కాంపౌండ్ హీరోగా అల్లు అర్జున్ కి అవకాశం దక్కింది. యువత సహా ప్రజల్లో భారీ అభిమానులను కలిగి ఉన్న స్టార్లను సాధారణంగా ఆకర్షించే కోలా బ్రాండ్లు అల్లు అర్జున్ వెంట పడటంలో ఆశ్చర్యం లేదు. ఇటీవల దేవరకొండ హవా తగ్గింది. సక్సెస్ లేకపోవడంతో ఇప్పుడు బ్రాండ్ అల్లు అర్జున్ వెంట పడుతోంది.

# 'అల వైకుంఠపురములో' తమిళ సినిమానా?

ముంబై బ్యూటీ పూజా హెగ్డే కెరీర్ బిగ్గెస్ట్ హిట్ చిత్రాలలో 'అల వైకుంఠపురములో' ఒకటి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించగా, సినిమా మొత్తం కథను నడిపించే అత్యంత కీలకమైన 'అల' పాత్రలో నటించింది పూజా. త్రివిక్రమ్ శ్రీనివాస్ పూజా పాత్ర చుట్టూ సినిమాను నడిపించాడు. అంతేకాదు.. ఈ సినిమాతోనే బుట్టబొమ్మగా తెలుగు వారి ప్రేమాభిమానాలను చూరగొంది. ఇప్పటికీ పూజాను 'బుట్ట బొమ్మా' అంటూ ప్రేమగా, అభిమానంగా పిలుస్తారు తెలుగు ప్రజలు. అలాంటి తెలుగు ప్రజలను పూజా తీవ్రంగా అవమానించింది. ఒక జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. "అల వైకుంఠపురములో తమిళ సినిమా" అని వ్యాఖ్యానించింది. "అల వైకుంఠపురములో నిజానికి తమిళ సినిమా.. ఇది పాన్-ఇండియా సినిమా కాదు. కానీ ప్రజలు దీనిని హిందీలో చూశారు. కాబట్టి పని బాగుంటే, అది ప్రజలకు చేరుతుంది" అని పూజా హెగ్డే చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా



మారాయి. మంచి కంటెంట్, పనితనం ఉన్న సినిమా ప్రజలకు చేరువవుతుందని పాజిటివ్ గా వ్యాఖ్యానించిన పూజా.. మరీ గుడ్డిగా ఒక తెలుగు సినిమాని తమిళ సినిమా అని వ్యాఖ్యానించడాన్ని తెలుగు ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ పూజా వ్యాఖ్యలపై విరుచుకుపడుతున్నారు. బన్నీ సరసన బ్యాక్ టు బ్యాక్ డీజే, అల వైకుంఠపురములో వంటి బ్లాక్ బస్టర్లలో అవకాశం అందుకున్న పూజా ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని సూచిస్తున్నారు. తెలుగు సినిమాకి ఘోర అవమానమిదని కూడా ఆవేదన చెందుతున్నారు. దక్షిణాది నిర్మాతలు, దర్శకులు, హీరోలు తాము నటించిన సినిమా భాష తెలియని హీరోయిన్లను ఎందుకు ప్రోత్సహిస్తారు? అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు అని ఒకరు వ్యాఖ్యానించారు. ఒకవేళ పొరపాటుగా మాట్లాడి ఉండొచ్చని కొందరు అన్నారు.

**పాన్ ఇండియా మీనింగ్– టాలీవుడ్:** 'ముకుంద' చిత్రంతో టాలీవుడ్ పూజాకు కథానాయికగా అవకాశం కల్పించింది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ అగ్రహీరోలు అవకాశాలు కల్పించారు. తనకోసం ఎంత చేసినా కానీ పూజా తెలుగు పరిశ్రమను మర్చిపోయిందని కూడా విమర్శిస్తున్నారు. నిజానికి తెలుగు సినిమా పాన్ ఇండియాలో అదరగొడుతోంది. బాలీవుడ్ ప్రముఖులు సైతం ఇప్పుడు తెలుగు సినీపరిశ్రమను కీర్తిస్తున్నారు. మన సినిమాల డబ్బింగులకు ఉత్తరాదిన గొప్ప ఆదరణ దక్కుతోంది. తెలుగు సినిమాల రీమేక్ లలో నటిస్తూ హిందీ హీరోలు కెరీర్ ని నిలబెట్టుకుంటున్నారు. ఇక తమిళ సినీ పరిశ్రమలో ఎందరు దిగ్గజాలు ఉన్నాకానీ ఇప్పటివరకూ 1000 కోట్ల క్లబ్‌ని కూడా అందుకోలేకపోయింది. వరుసగా 1000 కోట్ల క్లబ్ చిత్రాలతో సంచలనాలు సృష్టిస్తున్న తెలుగు సినీపరిశ్రమను పూజా ఎలా మర్చిపోయింది? అన్నది ప్రజల ఆవేదన. పొరపాటున కూడా టాలీవుడ్ ని మర్చిపోకూడదు కదా? దేశ ప్రజలంతా వీక్షించే పబ్లిక్ ప్లాట్ ఫామ్ లో పూజా ఇలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా? అని ప్రశ్నిస్తున్నారు.

# నా శరీరంలో అణువణువును తాకుతాను: తమన్నా

జైలర్ లో 'కావాలా' చార్ట్ బస్టర్‌గా నిలిచాక, తమన్నా భాటియా స్పెషల్ నంబర్ల క్వీన్ గా మారింది. ఆ తర్వాత స్త్రీ 2లో 'ఆజ్ కి రాత్' మరో సంచలనంగా మారింది. ఈ చార్ట్ బస్టర్ పాటలో తమన్నా నృత్యానికి యూత్ ఫిదా అయ్యారు. ముఖ్యంగా తమన్నా యూనిక్ బాడీ షేప్స్, పిచ్చెక్కించే మూవ్స్ కారణంగా కుర్రకారు కలల రాణిగా మారింది. డెబ్యూ నటి రాషా తడానీ ఆజాద్ ప్రివ్యూలో తమన్నాను 'ఆంటీ' అని పిలిచేసినా తన అందంలో మెచ్యూరిటీ, ఆకృతిలో కిక్ రేంజ్‌ని అది ఆవిష్కరించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన శరీరాకృతిపై తమన్నా తనపై తానే చేసిన కామెంట్ వెబ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఆ వ్యాఖ్య ఏమిటి? అంటే.. "నా శరీరంలోని ప్రతి భాగానికి ధన్యవాదాలు...అందానికి థాంక్స్" అని



వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యను బట్టి తమన్నా తన అందం, ఆకృతిపై ఎంత నమ్మకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా శరీరానికి నేను ఎంతో ఆనందిస్తాను.. దానిని ఆరాధిస్తున్నాను. నేను నా శరీరంలోని ప్రతి భాగాన్ని తాకుతాను. అన్నిటినీ తట్టుకుని నా కోసం నిలబడిన ఈ శరీరానికి కృతజ్ఞతలు అని తెలిపింది. తన శరీర అందాన్ని కాపాడుకునేందుకు తమన్నా ఎంతగా పాటుపడుతుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. శేఖర్ కమ్ముల 'హ్యాపీడేస్'లో నటించినప్పుడు తమన్నా భాటియా టీన్ లుక్ కి, ఇప్పటి తమన్నా లుక్ కి ఎంత వేరియేషన్ ఉందో యూత్ ఇట్టే చెప్పేయగలదు. నటుడు విజయ్ వర్మతో ప్రేమాయణం సాగిస్తున్న తమన్నా తొందర్లోనే పెళ్లాడుతుందని కథనాలొచ్చినా, ఊహించని రీతిలో ఇటీవల బ్రేకప్ పుకార్లు ఆశ్చర్యపరిచాయి. కానీ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడేందుకు తమన్నా పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. వృత్తిగతంగా అన్ని విషయాలను తమన్నా భాటియా షేర్ చేస్తోంది.

గరుడ వార్త






## క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా.. ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని భారత మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాదపూర్వకంగా కలిశారు. ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 ప్రపంచకప్ టీమ్‌లో మరో సభ్యురాలు ధ్రుతి కేసరి, టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. త్రిషను సత్కరించిన సీఎం.. భవిష్యత్‌లో దేశం తరఫున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభం నుంచి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో త్రిష అదరగొట్టింది. టీమ్‌ఇండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.




హైదరాబాద్: కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాల్సిందేనని, పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ కమిటీలో 50-60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారని తెలిపారు. మెజార్టీలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా న్యాయం జరగటం లేదన్నారు. "కులగణన సర్వే కోసం బీసీ సంఘాలు చాలా ఏళ్లు ఎదురుచూశాయి. గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాలి. భవిష్యత్‌లో జరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలి. కేంద్రం చేసే జనగణనలో కులగణన కూడా చేస్తానని భాజపా చెప్పాలి.

రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదు. వివరాలు ఇవ్వనివారు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రమూ చేయని ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసింది. చేసిన వారిని అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు.




## లావణ్యను చంపేందుకు మస్తాన్ సాయి ప్లాన్.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక విషయాలు పేర్కొన్నారు. లావణ్యను చంపేందుకు అతడు ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. మస్తాన్‌సాయి, అతడి స్నేహితుడు ఖాజాకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధరణ అయినట్లు రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడైంది. డ్రగ్స్ మత్తులో లావణ్య ఇంటికి మస్తాన్ సాయి వెళ్లి గొడవ చేశాడు.

అతడిపై ఎన్డీపీఎస్ సెక్షన్‌ను కూడా పోలీసులు జోడించారు. మస్తాన్ సాయి ల్యాప్‌టాప్‌లో ఉన్న లావణ్య వీడియోలను రాజ్‌తరుణ్ గతంలోనే తొలగించాడు. అయితే ఆలోపే ఇతర డివైస్‌లలోకి ఆ వీడియోలను మస్తాన్ సాయి కాపీ చేసుకున్నాడు. లావణ్యను పలుమార్లు చంపేందుకు అతడు యత్నించాడు. హార్డ్ డిస్క్ కోసం ఆమెను చంపేందుకు ప్లాన్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. గత నెల 30న లావణ్య ఇంటికి వెళ్లి హత్యాయత్నం చేసినట్లు వెల్లడించారు. మస్తాన్ సాయి అతని స్నేహితులు డ్రగ్స్‌తో పార్టీలు చేసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీకెండ్స్‌లో మస్తాన్ సాయి విల్లాలో భారీగా డ్రగ్స్ పార్టీలు జరిగేవి. మత్తులోకి జారుకున్న తర్వాత యువతులపై లైంగిక దాడికి పాల్పడేవాడు.

వారితో గడిపిన సమయంలో వీడియోలు రికార్డు చేసుకున్నాడు. కొందరు యువతులు డ్రగ్స్ తీసుకుంటున్నప్పుడు వీడియోలు రికార్డు చేశాడు. అతడి హార్డ్ డిస్క్‌లో వీటిని గుర్తించారు. ప్రస్తుతం నిందితుడి సెల్ ఫోన్, హార్డ్ డిస్క్‌ను ఎఫ్ఎస్ఎల్ టీమ్ విశ్లేషిస్తోంది.

## కులగణన సర్వే అడ్డుకోవడానికి భారాస కుట్ర: పొన్నం



హైదరాబాద్: కులగణన జరగకుండా చేయాలని భారాస కుట్ర చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. భారాసలో మూడు కీలక పదవులు ఒకరికే ఉండటంపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కులగణనలో పాల్గొనని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కులగణన సర్వే ద్వారా బలహీన వర్గాలకు ఒక రోడ్ మ్యాప్ తయారైందని పొన్నం పేర్కొన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలని.. బాధ్యతగా తీసుకొని సరిచేస్తామన్నారు. డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## బీసీ డిక్లరేషన్.. కాంగ్రెస్ హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలే: కేటీఆర్




హైదరాబాద్: కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. దీనిపై ఆ పార్టీకి స్పష్టత లేదన్నారు. మంగళవారం సమర్పించిన డేటాపై ప్రభుత్వానికి అవగాహన లేదని పేర్కొన్నారు. "కాంగ్రెస్‌కు 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా యూటర్న్ తీసుకుని నెపాన్ని కేంద్రంపై నెడుతున్నారు. ఆ పార్టీ హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలే అని రుజువైంది. రాహుల్ గాంధీ తన పేరును ఎన్నికల గాంధీగా మార్చుకోవాలి" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.




## పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు హమాస్.. హైఅలర్ట్‌లో నిఘా వర్గాలు..!

ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అడుగుపెట్టబోతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో భారత నిఘా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పీవోకేలో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్‌కు చెందిన సీనియర్ నేత ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్‌కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేశారు. దీనిలో ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, సీనియర్ నాయకులు కూడా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి ప్రసంగించనున్నట్లు కరపత్రాలు, ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. అతడు కశ్మీర్‌లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. జిహాదీ సంస్థలు తమ వాదనలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు దీనిని వాడుకోవచ్చు. మసూద్ అజర్ సోదరుడు తల్హాసైఫ్, అస్గర్‌ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు సభకు హాజరుకావచ్చని చెబుతున్నారు. ఈ సమయంలో భారత హోం మంత్రి అమిత్ షా మంగళవారం జమ్మూకశ్మీర్‌పై హైలెవల్ మీటింగ్‌ను నిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులను, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటి అంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కశ్మీర్‌లో వాహన తనిఖీలను కూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గతేడాది ఆగస్టులో హమాస్ నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా దీనికి వేదికైంది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అతడు సన్నిహితుడు.




## కర్ణాటక హైకోర్టులో విజయ్ మాల్యా పిటిషన్.. బ్యాంకులకు నోటీసులు

దిల్లీ: బ్యాంకులకు రూ.వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యూబీహెచ్ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు. తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మాల్యా తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6,200 కోట్ల రుణాన్ని తీసుకోగా.. దీనికి సంబంధించి రూ. 14 వేల కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

"ఈ విషయం గురించి లోక్‌సభలో ఆర్థిక మంత్రి తెలియజేశారు. మాల్యాకు చెందిన రూ.14, 131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని ఆమె తెలిపారు. ఆయన తీసుకున్న రుణంలో దాదాపు రూ.10, 200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తి రుణం చెల్లించినప్పటికీ.. ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకు నుంచి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలి" అని న్యాయవాది అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 13లోగా స్పందన తెలియజేయాలంటూ గడువు విధించింది. ఇదిలా ఉండగా.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.




డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 104 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హరియాణా, 33 మంది గుజరాత్ వాసులతో పాటు మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఇద్దరు చండీగఢ్ వాసులు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తొలుత, విమానంలో 205 మంది స్వదేశానికి వస్తున్నట్లు వార్తలు రాగా.. ఇప్పుడు ఆ సంఖ్య 104 అని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వలసదారుల సంఖ్యపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు దిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు పలువురిని తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

## ఇలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నాం: కాంగ్రెస్

దిల్లీ: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ భారతీయుల చేతికి సంకెళ్లు వేసి..వారిని నేరస్థులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవర్ ఖేడా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి..అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తించినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని కలవడానికి అప్పటి యూపీఏ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యూఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరించుకుందని పేర్కొన్నారు. కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా 1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని..కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యూఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమవలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com